నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

టాటా చేతికి ఎయిరిండియా - కేంద్రం కీలక ప్రటకన

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:భారీ నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను టాటా సన్స్ సొంతం చేసుకుంది. ఈ మేరకు కేంద్రం అధికారికంగా ప్రకటించింది. టాటా సన్స్ బిడ్‌కు కేంద్ర మంత్రుల కమిటీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. డిసెంబర్ నాటికి టాటా గ్రూప్ చేతికి ఎయిరిండియా రానుంది. 68 ఏళ్ల తర్వాత మళ్లీ టాటా చేతికి ఎయిరిండియా రానుంది. ఎయిరిండియా కోసం టాటా సన్స్, స్పైస్ జెట్ పోటా పోటీగా బిడ్ వేశాయి. అయితే, చివరకు టాటా సన్స్ గ్రూప్ బిడ్ ను దక్కించుకుంది.

హైదరాబాద్ శనివారం 9-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:28 సంచిక: 63 పేజీలు:4 వెల: రూ.1/-

తెలంగాణ అసెంబ్లీలో పీవీ నరసింహారావు చిత్రపటం ఆవిష్కరణ

హైదరాబాద్ , అక్టోబర్ 8:భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు చిత్రపటాన్ని శుక్రవారం అసెంబ్లీ లాబీలో సీఎం కే చంద్రశేఖర్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, స్పీకర్, ప్రొటెం చైర్మన్‌తో పాటు పలువురు పీవీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యీలు, ఎమ్మెల్యేలతో పాటు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పీవీ కుమార్తె సురభి వాణీదేవీ, ఆమె కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో మూడేండ్ల చిన్నారి కిడ్నాప్

నిజామాబాద్, అక్టోబర్ 8: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ షాపింగ్ మాల్ వద్ద మూడేండ్ల చిన్నారి కిడ్నాప్‌కు గురైంది. మెట్‌పల్లికి చెందిన ఓ కుటుంబం.. శుక్రవారం మధ్యాహ్నం షాపింగ్ కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చింది. షాపింగ్ చేసిన అనంతరం బిల్లులు చెల్లిస్తున్న సమయంలో ఆ కుటుంబానికి చెందిన మూడేండ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు.

చిన్నారి కిడ్నాప్‌పై పోలీసులకు బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కడున్న సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. బురఖా ధరించిన మహిళలు చిన్నారిని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. పాప ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఏడేండ్లలో సంక్షేమం కోసం రూ. 74,165 కోట్లు ఖర్చు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 8:రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగించారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో ఎస్సీ వెల్ఫేర్ కోసం రూ. 6,198 కోట్లు ఖర్చు పెట్టారు. మేం ఏడేండ్లలో రూ. 23,296 కోట్లు ఖర్చు చేశాం. ఎస్టీ వెల్ఫేర్ కోసం రూ. 3430 కోట్లు ఖర్చు పెడితే, మేం రూ.14,447 కోట్లు ఖర్చు చేశాం. బీసీ వెల్ఫేర్ కోసం కాంగ్రెస్ రూ. 6593 కోట్లు ఖర్చు పెడితే, టీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 19535 కోట్లు ఖర్చు చేశాం. మైనార్టీ వెల్ఫేర్ కోసం కాంగ్రెస్ రూ. 925 కోట్లు ఖర్చు చేస్తే, టీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 6971 కోట్లు ఖర్చు చేశాం. వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్‌లో కాంగ్రెస్ రూ. 4510 కోట్లు ఖర్చు చేస్తే, మేం రూ. 9916 కోట్లు ఖర్చు చేశాం. పదేండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఖర్చు రూ. 21,663 కోట్లు, టీఆర్ఎస్ సర్కార్ మాత్రం రూ. 74,165 కోట్లు ఖర్చు చేశాం అని సీఎం కేసీఆర్ తెలిపారు.

ఏపీ తలసరి ఆదాయం రూ. 1.7 లక్షలు, తెలంగాణ తలసరి ఆదాయం రూ. 2.37 లక్షలు అని తెలిపారు. కేంద్ర తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణది రెట్టింపు. కేంద్రం దగ్గరే లేదు.. ఇక తెలంగాణకు ఏం ఇస్తారు? రాష్ట్ర హక్కు ప్రకారం కేంద్రం నుంచి రావాల్సింది వస్తుంది. తెలంగాణే కేంద్రానికి ఇస్తుంది.. కేంద్రం తెలంగాణకు ఇచ్చేది లేదు. దేశ ఖజానాకు నిధులు సమకూర్చేది కేవలం నాలుగైదు రాష్ట్రాలు మాత్రమే. కేంద్రానికి నిధులు సమకూర్చే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కేంద్రం అసలు ఇస్తే కదా.. నిధులు మళ్లించడం జరిగేది అని సీఎం కేసీఆర్ తెలిపారు.

అన్ని మతాలను గౌరవించాలన్నదే మా అభిమతం : సీఎం కేసీఆర్

రాష్ట్రంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు వెనుకబడి ఉన్నారు. ఓసీల్లోనూ పేదలు ఉన్నారు. పేదల కోసం ఎంత గొప్పగా చేశామన్నదే పాయింట్. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది.. పదేళ్లలో ఎంతో చేశామని కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంది. కానీ ఫలితాలు కనిపించలేదు. సంక్షేమం, అభివృద్ధిలో వేగంగా ముందుకెళ్తున్నాం. దీర్ఘకాలికమైన ప్రాజెక్టులు జరుగుతున్నాయి. పారిశ్రామిక రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్నాం.ఆధ్యాత్మిక పరిమళాలు కూడా వెదజల్లుతున్నాయి. మక్కామసీదు రిపేర్ జరుగుతోంది. చర్చిలకు కూడా నిధులు ఇస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నాం. బోనాల పండుగకు నిధులు ఇచ్చి వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నాం. యాదాద్రి ఖ్యాతి విశ్వవిఖ్యాతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని మతాలను గౌరవించాలన్నదే మా ప్రభుత్వ అభిమతం.

ఈ మధ్య రాజకీయాల్లో చీప్‌గా మాట్లాడుతున్నారు. మీ జేబుల్లో నుంచి ఇస్తున్నారా? అని మాట్లాడుతున్నారు. ప్రజలు కట్టే పనులను సమన్వయం చేసి తిరిగి ప్రజలకు ఎంత ఉజ్వలంగా, వారి అవసరాల కోసం ఎట్ల వాడుతామన్నది వారి నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. మేం మొదటి టర్మ్‌లో తక్కువ మెజార్టీతో గెలిచాం. సెకండ్ టర్మ్‌లో మంచి మెజార్టీతో గెలిచాం. 32 జిల్లా పరిషత్‌లను గెలిచాం. మున్సిపాలిటీల్లో 136 గెలిచాం. హైదరాబాద్‌లో మేయర్ స్థానాన్ని కైవసం చేసుకున్నాం. మిగతా కార్పొరేషన్లలోనూ టీఆర్ఎస్‌దే విజయం. ఈ నేపథ్యంలో ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. గ్రామాల్లో వికాసం కనబడుతోంది అని సీఎం కేసీఆర్ తెలిపారు.

సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 8: సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారు అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. పల్లె, పట్టణ ప్రగతిపై శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా సభ్యులు మాట్లాడిన అనంతరం మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. పట్టణాలు ఆర్థికాభివృద్ధికి చోదకశక్తులుగా మారాయి. రాష్ట్ర భూభాగంలో 3 శాతంలోనే 50 శాతం జనాభా ఉన్నారు. రాష్ట్ర జనాభా దాదాపు సగం మంది పట్టణాల్లో ఉన్నారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా నాలుగు కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. దాదాపు 2 లక్షల మంది కమిటీల్లో ఉన్నారు. ఇండ్ల నిర్మాణానికి సెల్ఫ్ ఎసెస్‌మెంట్ విధానం తీసుకొచ్చాం. 75 గజాల్లోపు ఇంటి నిర్మాణానికి అనుమతి అవసరం లేదు.

టీయూ ఎఫ్ఐడీసీ ద్వారా అన్ని పట్టణాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేశాం. సీఆర్ఎంపీ కింద రూ. 1800 కోట్లకు పైగా నిధులతో రోడ్లను నిర్మిస్తున్నాం. ఎస్ఆర్‌డీపీ కింద లింకు రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. నాలాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టబోతున్నాం. చెరువుల సుందరీకరణకు ప్రత్యేక కమిషనర్‌ను నియమించాం. రూ. 37 కోట్లతో ట్యాంక్‌బండ్‌ను ఆధునీకరించాం. హుస్సేన్ సాగర్ వెంట నైట్ బజార్ ఏర్పాటు చేయబోతున్నాం. పట్టణాల్లో 54,776 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. నగరాల్లో పచ్చదనం పెంచేందుకు గ్రీన్ బడ్జెట్ ఏర్పాటు చేశాం. అర్బన్ పార్కులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశాం. డీఆర్ఎఫ్ బృందాలను భవిష్యత్‌లో ఇతర కార్పొరేషన్లకు విస్తరిస్తాం అని కేటీఆర్ తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎల్ రమణ

హైదరాబాద్ , అక్టోబర్ 8: సీఎం కేసీఆర్ బీసీ కుల గణన అంశానికి ఉన్న ప్రాధాన్యతను గ్రహించి శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించడం పట్ల టీఆర్ఎస్ సీనియర్ నేత ఎల్ రమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

ప్రస్తుత దేశ రాజకీయాల్లో బీసీ సామాజిక వర్గాల పాత్ర కీలకంగా మారిందన్నారు.

దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీ సామాజిక వర్గాల కుల గణన నిర్వహిస్తే బీసీ వర్గాలకు మరింత మేలు జరుగుతుందని రమణ తెలిపారు. ఇందుకోసం వారం రోజుల క్రితం సెంట్రల్ కోర్ట్ హోటల్‌లో జరిగిన సమావేశంతో పాటు అక్టోబర్ ఏడో తారీఖున సోమజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ గణన గురించి నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైనట్లు గుర్తు చేశారు. ఈ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయా లను, వక్తల అభిప్రాయాలను బీసీ కుల గణన ఆవశ్యకత పట్ల సీఎం కేసీఆర్‌కు వివరించడంతో సానుకూలంగా స్పందించారన్నారు. బిల్లుకు సహకరించిన శాసన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అలాగే బీసీ కుల గణన కోసం వివిధ రూపాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి బీసీవర్గాల్లో ఏకాభిప్రాయం తీసుకొచ్చేవదుకు అవిశ్రాంత ప్రయత్నం చేసిన బీసీ సంఘాల నాయకులను అభినందించారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో మసీదుపై దాడి

100 మంది మృతి

కాబూల్, అక్టోబర్ 8:: ఆఫ్ఘనిస్థాన్‌లోని మసీదుపై దాడి ఘటనలో 50 మంది మరణించారు. కుందుజ్‌లోని మసీదుపై శుక్రవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. దాడి జరిగిన సమయంలో మసీదులో వందల మంది ముస్లింలు ప్రార్థనలు చేస్తున్నారు. దాడి ఘటనలో క్షతగాత్రులతో కుందుజ్ సెంట్రల్ ఆస్పత్రి కిక్కిరిసిపోయింది.

ఈ ఘటనలో తమ ఆస్పత్రికి ఇప్పటికి 35 మృతదేహాలు తీసుకువచ్చారని, 50 మంది గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. ఇక ఇతర ఆస్పత్రుల్లోనూ బాధితులు చికిత్స పొందుతున్నారు. మృతులు, క్షతగాత్రుల బంధువుల రోదనలతో కుందుజ్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుందుజ్ మసీదులో పేలుడు ఘటనలో పలువురు మరణించగా, పెద్దసంఖ్యలో ప్రజలకు గాయాలయ్యాయని తాలిబన్ ప్రతినిధి జబీహుల్లా ముజహిద్ తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్పమార్పులు

హైదరాబాద్ , అక్టోబర్ 8:తెలంగాణ ఇంటర్ ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్పమార్పులు చోటు చేసుకున్నాయి. హుజూరాబాద్ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో పరీక్షల తేదీల్లో మార్పులు చేశారు. ఈ నెల 29, 30న జరగాల్సిన పరీక్షలను ఈ నెల 31, నవంబర్ 1వ తేదీకి మార్చారు.

అక్టోబర్ 25న సెకండ్ లాంగ్వేజ్, 26న ఇంగ్లీష్, 27న మ్యాథ్స్-1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్, 28న మ్యాథ్స్-1బీ, జువాలజీ, హిస్టరీ, 31న ఫిజిక్స్, ఎకనామిక్స్, నవంబర్ 1న కెమిస్ట్రీ, కామర్స్, 2న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, 3న మోడ్రన్ లాంగ్వేజ్, జియోగ్రఫీ పేపర్లకు ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు.

తెలంగాణలో అక్టోబర్ 25 నుంచి ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు గతంలో ప్రకటించిన విషయం విదితమే. 2020-21 విద్యాసంవత్సరానికి చెందిన ఫస్టియర్ విద్యార్థులకు (ప్రమోటై ప్రస్తుతం సెకండియర్‌లో ఉన్న విద్యార్థులు) పరీక్షలు నిర్వహించనున్నారు. 70 శాతం సిలబస్ నుంచే ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న సిబ్బందినే విధుల్లోకి తీసుకుంటామన్నారు. ప్రతి ఎగ్జామ్ సెంటర్‌లో ఒకట్రెండు ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఎన్ఎం లేదా స్టాఫ్ నర్సు అందుబాటులో ఉండనున్నారు.

మిషన్ భగీరథ పథకంపై నీతి ఆయోగ్ ప్రశంసలు

హైదరాబాద్ , అక్టోబర్ 8:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఉన్న నీతి ఆయోగ్ ప్రసంశల జల్లు కురిపించింది. మిషన్ భగీరథ అద్భుతమైన పథకం అని నీతి ఆయోగ్ కితాబు ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ ట్విట్టర్ వేదికగా వెల్లడిస్తూ ప్రశంసలు కురిపించారు. మిషన్ భగీరథ ద్వారా వంద శాతం ఇండ్లకు తాగు నీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 54 లక్షల 6 వేల 70 ఇండ్లకు మిషన్ భగీరథ ద్వారా నల్లాలతో తెలంగాణ రాష్ట్రం తాగు నీటిని అందిస్తోంది. ఇది వంద శాతం. హర్యానా రాష్ట్రంలో 30 లక్షల 96 వేల 792 ఇండ్లకు, గోవా రాష్ట్రంలో 2 లక్షల 63 వేల 13 ఇండ్లకు, పుదుచ్చేరిలో 1 లక్ష 14 వేల 908 ఇండ్లకు తాగు నీటిని అందిస్తూ వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని కేంద్ర నీతి ఆయోగ్ పేర్కొంది.

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు హర్షం

కేంద్ర నీతి ఆయోగ్ రాష్ట్ర మిషన్ భగీరథ పథకానికి కితాబును ఇవ్వడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న సీఎం కేసీఆర్ అకుంఠిత దీక్షకు ఈ పథకం నిదర్శనం అని వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు వినోద్ కుమార్ కేంద్ర నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్‌కు రీ ట్వీట్ చేశారు.

లఖింపుర్ కేసులో దర్యాప్తు సంతృప్తికరంగా లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరిలో చెలరేగిన హింసలో 8 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ ఘటనపై దాఖలు అయిన సుమోటో కేసును ఇవాళ సుప్రీంకోర్టులో విచారించారు. అయితే లఖింపుర్ ఘటనలో యూపీ పోలీసులు నిర్వహిస్తున్న దర్యాప్తు సంతృప్తికరంగా లేదని సుప్రీంకోర్టు తెలిపింది. సాక్ష్యాలను భద్రపరుచాలని కోర్టు పేర్కొన్నది. మళ్లీ ఈనెల 20వ తేదీన ఈ కేసును విచారించనున్నారు. ఇవాళ విచారణ సందర్భంగా యూపీ సర్కార్ తరపున సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే తరపున వాదించారు. రాష్ట్రానికి చెందిన ఉన్నత పోలీసు అధికారికి సాక్ష్యాల భద్రత గురించి తెలియజేయనున్నట్లు ఆయన చెప్పారు.

యూపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సంతృప్తికరంగా లేమని, బాధ్యతాయుతమైన ప్రభుత్వం, పోలీసు వ్యవస్థను కొరుకుంటున్నామని, లఖింపూర్ ఘటనపై వస్తున్న ఆరోపణలు చాలా తీవ్ర స్థాయిలో ఉన్నాయని చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. మీరెటువంటి సందేశాన్ని ఇస్తున్నారు, సాధారణ పరిస్థితుల్లో పోలీసుల వెంటనే వెళ్లి నిందితుల్ని అరెస్టు చేయరా అని సీజే ప్రశ్నించారు. జరుగాల్సిన పద్ధతిలో దర్యాప్తు సాగడం లేదని, మాటలు తప్ప చేతలు లేవని సీజే రమణ విచారణ సమయంలో యూపీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు.

సీబీఐ పరిష్కారం కాదు..

యూపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను అడ్వకేట్ హరీశ్ సాల్వే సుప్రీంకు సమర్పించారు. ఒకవేళ ఆ నివేదిక సంతృప్తికరంగా లేకుంటే, అప్పుడు ఆ కేసును సీబీఐకి అప్పగించాలని సాల్వే సూచించారు. అయితే సాల్వే సూచనను స్వాగతించిన సీజే.. సమస్య చాలా సున్నితమైందని, ఈ విషయంలో మేం ఎటువంటి కామెంట్లు చేయడం లేదని, సీబీఐ దీనికి పరిష్కారం కాదు అని, అది ఎందుకు మీకు తెలుసు అని, ఈ కేసును మరో వ్యక్తి డీల్ చేస్తే బాగుంటుందని చీఫ్ జస్టిస్ అభిప్రాయపడ్డారు. రైతుల మరణానికి కారణాలు తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు, ఇలాంటి ఘటనల్లో ఇతర నిందుతులను ఇలాగే చూస్తారా అని సీజే అడిగారు.

మీడియా తీరు..

అడ్వకేట్ అగ్నిత్ ఆదిత్య ఓ ట్వీట్ గురించి విచారణ సమయంలో ప్రస్తావించారు. లఖింపూర్ బాధిత కుటుంబాన్ని చీఫ్ జస్టిస్ పరామర్శించినట్లు టైమ్స్ నౌ చేసిన ఓ ట్వీట్ గురించి కోర్టులో అడిగారు. అయితే అవన్నీ టీవీ ముచ్చట్లు అని సీజేఐ రియాక్ట్ అయ్యారు. కానీ మీడియా వ్యవహరిస్తున్న తీరును జస్టిస్ కాంత్ ఖండించారు. భావ ప్రకటన, భావ స్వేచ్ఛను మీడియా అతిక్రమిస్తోందని ఆయన అన్నారు. అయితే ఈ కేసులో విచారణ సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో ఆ అంశాన్ని సీజే పట్టించుకోలేదని జస్టిస్ కాంత్ అన్నారు. అలాంటి ట్వీట్లకు తామంతా బాధితులమే అని అడ్వకేట్ హరీశ్ సాల్వే అన్నారు. ఇలాంటి ట్వీట్ల విషయంలో కోర్టు ధిక్కరణ కేసు వేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. మీడియాలో వస్తున్న వార్తలను ఖండించిన సీజేఐ.. తాను కోర్టులో ఉండగా, ఎలా లక్నో వెళ్లగలనని ప్రశ్నించారు. ఇదే సమయంలో జస్టిస్ హిమా కోహ్లీ స్పందిస్తూ.. మీడియా స్వేచ్ఛను గౌరవిస్తామని, కానీ హద్దులు దాటేందుకు ఇది మార్గం కాదన్నారు.

విపక్ష సభ్యులకు కంటి వెలుగు క్యాంపు.. టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చురకలు

హైదరాబాద్ , అక్టోబర్ 8: రాష్ట్రంలోని విపక్ష ఎమ్మెల్యేలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. టీఆర్ఎస్ సర్కార్ సంక్షేమ పథకాలపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. విపక్ష సభ్యులకు చురకలంటించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు విపక్షాలకు కనబడుతలేవా? అని ప్రశ్నించారు. కళ్లున్న కబోదుల్లా బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కంటి వెలుగు క్యాంపు నిర్వహించాలని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. అప్పుడైనా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కనిపిస్తాయన్నారు. ఆ తర్వాతనైనా ప్రభుత్వాన్ని విమర్శించకుండా ఉండే అవకాశం ఉంటుందని విపక్ష సభ్యులను ఉద్దేశించి జీవన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయాలను సంక్షేమం కోసం ఖర్చు చేస్తుంది. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. కానీ కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవని జీవన్ రెడ్డి గుర్తు చేశారు.

నాణ్యమైన పత్తి ఉత్పత్తిలో మొదటి స్థానంలో తెలంగాణ: మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 8: నాణ్యమైన పత్తి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. పత్తిసాగు విస్తీర్ణంలో దేశంలో రెండో స్థానంలో ఉన్నామని చెప్పారు. పత్తిలో తేమ శాతం, వర్షాలతో పంటనష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఈసారి పత్తి సేకరణ లక్ష్యం 33.20 లక్షల మెట్రిక్ టన్నులని చెప్పారు. ప్రతి సంవత్సరం కంటే ఈ ఏడాది రెట్టింపు పత్తి ఉత్పత్తి అవుతుందన్నారు. పత్తి కొనుగోలుకు జిన్నింగ్ మిల్లులనే నోటిఫైడ్ ఏజెన్సీలుగా గుర్తింపునిచ్చామన్నారు. మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువ ఉంటేనే సీసీఐ కొంటుందన్నారు. రైతులకు సబ్సిడీ మీద టార్పాలిన్స్ ఇచ్చామని చెప్పారు. కరోనా సమయంలో జిన్నింగ్ మిల్లులపై విద్యుత్ పెనాల్టీల విషయం పరిశీలనలో ఉందన్నారు. జిన్నింగ్ మిల్లులో జరిగే ప్రమాదాలతో రైతుకు సంబంధం ఉండదని చెప్పారు. 2016-17, 2017-18 సంవత్సరాల ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లించామని తెలిపారు. ఇప్పటివరకు బీమా కోసం రూ.989 కోట్లకుపైగా ప్రీమియం చెల్లించామన్నారు. కేంద్రం తెచ్చిన పథకం వల్ల రైతుల కంటే బీమా కంపెనీలకు ఎక్కువ లబ్ధి జరుగుతున్నదని విమర్శించారు. బీమా పథకం నిబంధనల్లో మార్పులు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులు అప్పు చేయకూడదనే రైతు బంధు పతకం తెచ్చామన్నారు. ఇలాంటి పథకం ప్రపంచంలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు.

16లోపు టీకా వేసుకోకపోతే.. ప్రభుత్వ ఉద్యోగులను అనుమతించం

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:దేశ రాజధాని ఢిల్లీలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు అక్కడి ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. ఈ నెల 16లోపు టీకా వేసుకోని వారిని ప్రభుత్వ కార్యాలయాల్లోకి అనుమతించబోమని హెచ్చరించింది. వ్యాక్సిన్ వేయించుకోని ప్రభుత్వ ఉద్యోగులు వ్యాక్సిన్ తీసుకునే వరకు సెలవులో ఉన్నట్లుగా పరిగణిస్తామని తెలిపింది. ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ (డీడీఎంఏ) ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'అక్టోబరు 15 లోపు వ్యాక్సిన్ తీసుకోని (కనీసం మొదటి డోస్) ప్రభుత్వ ఉద్యోగులు అక్టోబర్ 16 నుంచి మొదటి డోస్ వ్యాక్సిన్ పొందే వరకు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, విద్యాసంస్థలకు హాజరుకావడానికి అనుమతించబోం. సంబంధిత విభాగాల అధిపతులు ఆరోగ్య సేతు యాప్ లేదా టీకా సర్టిఫికెట్ ద్వారా టీకాలు తీసుకున్న ఉద్యోగులను ధృవీకరిస్తారు' అని అందులో పేర్కొంది.

ఢిల్లీ చీఫ్ సెక్రటరీ విజయ్ దేవ్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలో పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇలాంటి ఆదేశాలు జారీ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణించవచ్చని అందులో సూచించారు.

టాటాకు స్పైస్‌జెట్ చైర్మన్ అభినందనలు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఎయిర్ ఇండియా (ఏఐ) బిడ్‌ను గెలుచుకున్న టాటా సన్స్ గ్రూప్‌ను స్పైస్‌జెట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ సింగ్ అభినందనలు తెలిపారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న ఎయిర్ ఇండియా కోసం టాటా సన్స్ స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) టాలెస్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన బిడ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. రూ.18 వేల కోట్లకు టాటా సన్స్ బిడ్ దాఖలు చేసింది.

స్పైస్ జెట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్‌సింగ్ రూ.15,100 కోట్లకు బిడ్ వేశారు.

టాటా చేతిలో మహారాజాకు పూర్వవైభవం

ఎయిరిండియా బిడ్‌ను గెలుచుకున్న టాటా గ్రూప్‌ను నేను అభినందిస్తున్నా. వారు (టాటాసన్స్) విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా.

ఎయిర్ ఇండియా కోసం దాఖలు చేసిన బిడ్లలో షార్ట్ లిస్టెడ్ సంస్థల జాబితాలో నేను ఉన్నందుకు గర్విస్తున్నా. ఎయిర్ ఇండియా పూర్వ వైభవాన్ని టాటా గ్రూప్ పునరుద్ధరిస్తుందని నేను విశ్వాసంతో ఉన్నా. భారతీయులందరికీ గర్వకారణంగా ఎయిరిండియాను నిలుపుతుందని నమ్ముతున్నా అని ఓ ప్రకటనలో తెలిపారు.

పారదర్శకంగా, అనువైన ప్రక్రియ చేపట్టి ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణలో విజయవంతమైనందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నా. భారత ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియకు ఇది ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నా.. నేను నా జీవితంలో ఎయిర్ ఇండియాకు అభిమానిని. ప్రపంచ ఎయిర్‌లైన్స్‌కు తిరిగి ఎయిర్

నాణ్యమైన విద్యతోనే ప్రపంచ సమగ్ర సుస్థిరాభివృద్ధి

(యుయన్ 'సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్-2030' నివేదిక-2021 ఆధారంగా)

2015లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం '2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సానుకూల సుస్థిరాభివృద్ధి మార్పులు' చేపట్టాలనే సదుద్దేశంతో 17 'ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'ని నిర్ణయించారు. ఈ 17 లక్ష్యాలను '2030 ఎజెండా' అని కూడా పిలుస్తాం. పేదరికం, ఆకలి చావులు, ఆరోగ్యం, విద్య, పర్యావరణ మార్పులు, లింగ సమానత్వం, సురక్షిత నీరు, పారిశుధ్యం, శక్తి వనరులు, పట్టణీకరణ, భూతాపం, సామాజిక న్యాయం లాంటి ప్రధాన అంశాలు తీసుకోబడినవి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030లో నాలుగవ లక్ష్యంగా 'నాణ్యమైన విద్య (క్వాలిటీ ఎడ్యుకేషన్)' అనబడే అంశం అధ్యయనం చేయబడుతున్నది. సామాజిక న్యాయం, అసమానతలు, పేదరికం, లింగ భేదం, ఆకలి చావులు, నిరుద్యోగం లాంటివ ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. గత దశాబ్దకాలంగా విద్యారంగంలో ప్రపంచమానవాళి ఎంతో ముందడుగు వేసింది. అయినప్పటికీ 2018లో కూడా 260 మిలియన్ల (20 శాతం పిల్లలు) అర్హతగల ప్రపంచ బాలలు (5.5 మిలియన్ల ప్రాథమిక స్థాయి పిల్లలు) బడులకు దూరంగా బాలకార్మికులుగా మగ్గుతున్నట్లు తెలుస్తున్నది. 2020లో కరోనా విజృంభనతో విశ్వ విద్యావ్యవస్థ 91 శాతం లాక్‌డౌన్‌లతో మూతబడడం, 1.6 బిలియన్ల పిల్లలు బడులకు దూరం కావడం జరిగింది. దాదాపు 369 మిలియన్ల బాలలు మద్యాహ్న పోషకాహార భోజనాలను పొందలేక, అనారోగ్యాల పాలు అయిపోయారు. కోవిడ్-19 కొరడా దెబ్బ విద్యా వ్యవస్థపై అధికంగా పడడంతో, దీని దుష్ప్రభావం రాబోయే తరంపై ప్రతికూలంగా పడనుంది.

ఐరాసలోని యునెస్కో శాఖ చొరవతో ప్రపంచ విద్య పర్యవేక్షణ, పాఠశాలలకు తెరవడం పట్ల చొరవ తీసుకుంటున్నది. మార్చి-2020లో యునెస్కో ప్రారంభించిన 'కోవిడ్-19 గ్లోబల్ ఎడ్యుకేషన్ కొహలిషన్' వేదికగా యూయన్ కుటుంబం, పౌర సమాజ సంస్థలు, మీడియా, ఐటీ పార్టనర్స్ సమన్వయంతో సమస్యలకు వినూత్న పరిష్కారాలు తీసుకుంటున్నారు. దాదాపు 145 మధ్య ఆదాయ మరియు పేద దేశాల్లో విద్య అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి అవసరమైన ఆన్‌లైన్ బోధనలు, ఆధునిక సదుపాయాలు కల్పించనున్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యం మహోన్నతమైనది. పేదరిక కోరల్లో చిక్కిన కుటుంబాలకు చెందిన పిల్లలకు చదువు అందని ద్రాక్షే అవుతున్నది. అసమానతలు తగ్గడం, లింగ సమానత్వ సాధన, శాంతియుత సమాజ స్థాపన లాంటివి నాణ్యమైన విద్యతోనే ఫలిస్తాయని తెలుసుకోవాలి. 2000లో ప్రాథమిక విద్య 70 శాతం మాత్రమే ఉండగా, 2018లో 84 శాతానికి పెరగడం హర్షదాయకం. 2030 నాటికి 89 శాతం పిల్లలకు ప్రాథమిక విద్య అందనుందని అంచనా. 2018 వివరాల ప్రకారం 15 ఏండ్లు దాటిన ప్రజల ప్రపంచ అక్షరాస్యత రేటు 86 శాతం ఉండగా, 15-24 మధ్య యువతలో 92 శాతంగా నమోదైంది. 2018లో 773 మిలియన్ల ప్రజలు నిరక్షరాస్యులుగానే మిగలడం విచారకరం.

అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య కల్పించే పథకాలు నెమ్మదిగా అమలు అవుతున్నాయి. 2030 నాటికి 200 మిలియన్ల పిల్లలు బడుల దారులకు దూరం అవుతారని అంచనా. కోవిడ్-19 కోరల్లో నలిగిన విద్యా వ్యవస్థ వల్ల మిలియన్ల (90 శాతం, దాదాపు 500 మిలియన్లు) బాలలు ఆన్‌లైన్ దూరవిద్య పొందలేక పోయారు. ధనిక కుటుంబాల్లో 79 శాతం, పేద కుటుంబాల్లో 34 శాతం పిల్లలు పాఠశాల విద్యను పూర్తి చేశారు. దాదాపు 65 శాతం పాఠశాలల్లో మాత్రమే చేతులు శుభ్రపరుచుకోవడానికి నీటి వసతులు కలిగి ఉన్నాయి. విశ్వవ్యాప్తంగా 617 మిలియన్ల బాలలు మౌళిక గణితశాస్త్రంలో వెనుకబడి ఉన్నారని, శరణార్థులు/అంగవైకల్యం కలిగిన పిల్లల చదువులకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. ప్రపంచ మహిళల్లో 736 మిలియన్లు (ప్రతి ముగ్గురిలో ఒక్కరు) భౌతిక/లైంగిక హింసను అమృనుభవిస్తున్నారని, 15-19 వయస్కుల్లో 24 శాతం, 20-24 ఏండ్ల యువతుల్లో 26 శాతం హింసకు లేనవుతున్నారని తెలుస్తున్నది. ఇలాంటి అణచి వేతల వల్ల విద్య మహిళలకు దూరం అవుతున్నదని అంటున్నారు. కరోనా విపత్తులో అదనంగా 10 మిలియన్ల బాలికలకు బాల్యవివాహాలు జరిగాయని తెలుస్తున్నది. పాఠశాలల్లో కనీస టాయిలెట్ల వసతులు లేకపోవడం కారణంగా బాలికల నమోదు తగ్గుతున్నది. ప్రపంచదేశాల్లో, ముఖ్యంగా పేద దేశాల్లో నిర్బంధ బాలల విద్యను కల్పించడానికి అధిక ఆదాయదేశాలు చేయూతను ఇవ్వడం, విద్యాలయాల్లో సకల సౌకర్యాలు కల్పించడం విధిగా జరిగితేనే 2030 నాటికి ఆశించిన ఉన్నత విద్య లక్ష్యాలు నెరవేరుతాయని నమ్ముదాం. ఉన్నత నాణ్యమైన విద్య సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. రెపో రేటు 4 శాతం వద్ద, రివర్స్ రెపో రేటు 3.35 వద్ద కొనసాగనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. కీలక వడ్డీ రేట్లు సహా ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను సమీక్షించేందుకు.. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) బుధవారం భేటీ అయ్యింది. మూడు రోజుల సమీక్ష అనంతరం కమిటీ తీసుకున్న నిర్ణయాలను దాస్ శుక్రవారం వెల్లడించారు. ఇన్‌స్టాంట్ ఫండ్ ట్రాన్సఫర్ ఇమ్మిడీయేట్ పేమెంట్ సర్వీసెస్(ఎఓఖూ) ట్రాన్సాక్షన్ పరిమితిని రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల వరకు పెంచాలని ప్రతిపాదన చేసినట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. దేశంలో 40 శాతం ఆర్థిక కార్యకలాపాలకు దోహదపడే కాంటాక్ట్ ఇంటెన్సివ్ సర్వీసెస్ ఇప్పటికీ వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సరఫరా వైపు, ఖర్చు ఒత్తిడి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతోందన్నారు.

పంటల సేకరణపై రాష్ట్రాల పోర్టల్స్‌ను సమీకృతం చేసే వ్యవస్థ!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:వ్యాపారులను, మధ్య దళారులనుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు, రైతులకు తగిన ప్రయోజనం కలిగించేందుకు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ ఒక సానుకూల వ్యవస్థతో కూడిన అప్లికేషన్.ను రూపొందించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని పంటసేకరణ పోర్టళ్లను సమీకృతం చేసేందుకు, పర్యవేక్షణకు, వ్యూహాత్మక నిర్ణయం తీసుకునేందుకు అవసరమైన కనీస ప్రారంభ ప్రమాణాలతో (ఎం.టి.పి.లతో) ప్రత్యేక ఏర్పాట్లతో ఈ వ్యవస్థను రూపొందించారు.

అక్టోబరు నెలలో మొదలైన 2021-22వ సంవత్సరపు ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ (కె.ఎం.ఎస్.)తో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. పంటల సేకరణ ప్రక్రియలో మధ్య దళారుల ప్రమేయాన్ని తొలగించేందుకు, రైతులు తమ పంటకు సాధ్యమైనంతవరకూ అత్యుత్తమమైన విలువను పొందేలా చూసేందుకు ఈ కనీస ప్రారంభ ప్రమాణాల విధానం అవసరమైంది. ఇందుకు సంబంధించిన కేంద్ర పోర్టల్.ను సమీకృతం చేయడవల్ల, ఆయా రాష్ట్రాల సేకరణ లెక్కలను సర్దుబాటు చేసుకునేందుకు, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అవసరమైన నిధులను విడుదల చేసేందుకు వీలు కలుగుతుంది.

ఈ వ్యవస్థవల్ల సాధారణంగా సమాజానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నా, వివిధ భాగస్వామ్య వర్గాలకు అందే ప్రయోజనాలు మాత్రం ఈ కింది విధంగా ఉంటాయి.:

రైతులు: తమ ఉత్పత్తులను తగిన రేట్లకు అమ్ముకోవడానికి రైతులకు వెసులుబాటు కలుగుతుంది. పంటలను తెగనమ్ముకోవలసిన అవసరం ఉండదు.

సేకరణ సంస్థలు: పంటసేకరణ కార్యకలాపాల నిర్వహణకు మరింత మెరుగైన వ్యవస్థ అందుబాటులోకి రావడంతో వివిధ రాష్ట్రాల ఏజెన్సీలు, భారతీయ ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.) తమ పరిమిత వనరులతోనే సమర్థవంతంగా సేకరణ ప్రక్రియను నిర్వహించ గలుగుతాయి.

ఇతర భాగస్వామ్య వర్గాలు: సేకరణ ప్రక్రియ కార్యకలాపాలను యాంత్రీకరించి, ప్రమాణీకరించడంతో, ఆహార ధాన్యాల సేకరణ, గోదాముల్లో నిల్వ తదితర అంశాలపై సమీకృత పరిశీలనకు అవకాశం ఉంటుంది.

ఏకరూపత, పరస్పర నిర్వహణా ప్రయోజనాలకోసం కనీస ప్రారంభ ప్రమాణాలను అన్ని సేకరణ పోర్టళ్లలోనూ ఈ కింది అంశాలతో పొందుపరచవలసిన అవసరం ఉంది.:

రైతులు/పంట భాగస్వాముల ఆన్ లైన్ రిజిస్ట్రేషన్: పేరు, తండ్రిపేరు, చిరునామా, మొబైల్ నంబరు, ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా నంబరు, భూమి వివరాలు, సొంతంగా సాగు, లేదా భాగస్వామ్య సాగు వంటి అంశాలను రిజిస్టర్ చేయించాలి.రిజిస్టరైన రైతు సమాచారాన్ని సంబంధిత రాష్ట్రానికి చెందిన భూమి రికార్డు పోర్టల్.తో సమీకృతం చేయడం.డిజిటలైజ్ చేసిన మండి/సేకరణ కేంద్రం కార్యకలాపాలు: కొనుగోలుదారు/విక్రయదారు ఫారాలు, విక్రయ ప్రక్రియకు సంబంధించిన బిల్లులు తదితరాలు.ఎక్స్. పెండిచ్యూర్ అడ్వాన్స్ ట్రాన్సఫర్ (ఇ.ఎ.టి.) పద్ధతి ద్వారా ఆన్ లైన్ చెల్లింపు. కనీస మద్దతు ధర ప్రయోజనాన్ని వేగంగా రైతులకు బదలాయించేందుకు ఇదే మార్గం.మర ఆడించిన లెవీ బియ్యం/గోధుమల బట్వాడా నిర్వహణ- అంగీకార పత్రం అప్.లోడ్ చేసిన వెంటనే తనంతట తానే బిల్లును రూపొందించే వ్యవస్థ/బరువును సరిచూసే మెమో, నిల్వను స్వాధీనం పరుచుకునే వ్యవస్థ.వాస్తవ సమయంలో ఎంతమంది రైతులు, పంట భాగస్వాములు ప్రయోజనం పొందారన్నది తెలిసేందుకు వీలుగా భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సమీకృత పోర్టల్.కు అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్.ఫేసెస్ ద్వారా సమాచారాన్ని పంపిణీ చేయడం. ప్రయోజనం పొందిన రైతుల్లో చిన్నకారు/మధ్యతరహా రైతుల సంఖ్య, దిగుబడి, సేకరించిన పంట పరిమాణం, జరిగిన చెల్లింపు, కేంద్ర నిల్వల నిర్వహణ వంటి అంశాలను తెలుసుకునేందుకు కూడా ఈ వ్యవస్థలో వీలు కలుగుతుంది. వివిధ రాష్ట్రాలో ఈ వ్యవస్థలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అమలు వివిధ స్థాయిల్లో ఉందన్న అంశాన్ని ఇక్కడ గుర్తుంచుకోవడం అవసరం. పైగా,.. స్థానిక అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంవల్ల అఖిల భారత స్థాయిలో ప్రమాణీకరించిన సానుకూల వ్యవస్థ ఎక్కడా అందుబాటులో లేదు. పంటల సేకరణ వ్యవస్థల్లో వ్యత్యాసాలు కొనసాగుతున్న కారణంగా, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో సవాళ్లు ఎదురవుతున్నాయి. వివిధ రాష్ట్రాల సేకరణ కార్యకలాపాలతో సర్దుబాటు చేసుకోవడం ఒక్కోసారి దీర్ఘకాలిక ప్రక్రియగా మారుతోంది. దీనితో రాష్ట్రాలకు నిధుల విడుదల ప్రక్రియలో పలు రకాలుగా జాప్యం చోటుచేసుకుంటోంది. దీనికి తోడు,..ప్రమాణీకరించిన సేకరణ కార్యకలాపాలు లేని కారణంగా, ప్రక్రియ సమర్థవంతంగా జరగడంలేదు. దీనితో పంటల సేకరణ కార్యకలాపాల్లో మధ్యదళారుల రూపంలో జోక్యం ఏర్పడుతోంది. రైతుల సంక్షేమానికి, కనీస మద్దతు దర ప్రాతిపదిన చేపట్టే సేకరణ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నది ఇక్కడ గమనార్హం. రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరను పొందేలా చూడటానికి ఇదే సరైన సంప్రదాయబద్ధమైన మార్గం. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను సాధించడానికి, జాతీయ ఆహార భద్రతా చట్టం సంపూర్ణ స్థాయిలో అమలు చేయడానికి వీలవుతుంది. పంటల సేకరణ కార్యకలాపాల్లో పారదర్శకత, సామర్థ్యం సాధించాలంటే సదరు కార్యకలాపాలను ప్రమాణబద్ధం చేయడం చాలా అవసరం. తద్వారానే చివరకు దేశ ప్రజలకు ఆహార భద్రత సాధించడం సులభతరమవుతుంది.ఈ నేపథ్యంలోనే పంటల సేకరణకోసం కనీస ప్రారంభ ప్రమాణాలను రూపొందించడం, వాటిని కేంద్ర ఆహార ధాన్యాల సేకరణ పోర్టల్.తో (సి.ఎఫ్.పి.పి.తో) సమీకృతం చేయడం తదితర అంశాల ఆవశ్యకతపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు, ఇతర ప్రభుత్వ సేకరణ ఏజెన్సీలకు కేంద్రప్రభుత్వం అవగాహన కల్పించింది. ఇందుకోసం కేంద్రం పలు వేదికలను ఆశ్రయించింది. అనంతరం కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ ఒక సానుకూల వ్యవస్థతో కూడిన అప్లికేషన్.ను రూపొందించింది.

సబ్‌కా ప్రయాస్ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్ళాలని పిలుపిచ్చిన ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తో కలిసి విద్యా మంత్రిత్వ శాఖ సబ్ కా ప్రయాస్ః నేటి సమిష్టి భాగస్వామ్యం అన్న అంశంపై వెబినార్‌ను నిర్వహించింది. భారత ప్రభుత్వం సుపరిపాలనపై 17 సెప్టెంబర్ 2021 నుంచి 7 అక్టోబర్ 2021 వరకు నిర్వహిస్తున్న వెబినార్ల పరింపరలో ఈ వెబినార్ ఒక భాగం. ఈ వెబినార్‌లో కేంద్ర విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర వాణిజ్యండపరిశ్రమలు, వినియోగదారుల వ్యవవహారాలుడ ఆహారండ ప్రజాపంపిణీ డ జౌళి పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సంజయ్ మూర్తి, యుజిసి చైర్మన్ ప్రొఫెసర్ డి.పి. సింగ్, మంత్రిత్వ శాఖ, యుజిసికి చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, సుపరిపాలన ప్రాముఖ్యతను, అవసరాన్ని ధర్మేంద్ర ప్రధాన్ నొక్కి చెప్పారు. కోవిడ్ మహమ్మారి కాలంలో ప్రపంచానికి సహాయం చేసిన ప్రముఖ రదేశాలలో భారత్ ఒకటి అని చెప్పారు. దేశాన్ని అద్భుతమైన భవిష్యత్తు దిశగా భవిష్యత్ తరాలు నడిపించడానికి రానున్న 25 సంవత్సరాలు కీలకంగా ఉంటాయని ఆయన అన్నారు.

స్వయం సమృద్ధమైన భారత్ గా దేశాన్ని మలిచడంలో ప్రజల భాగస్వామ్య ప్రాముఖ్యతను మంత్రి ఉద్ఘాటించారు. మోడీ ప్రభుత్వ పరిపాలనా నమూనాలో జన్ భాగీదారి అన్న కీలకమైన స్తంభమని ఆయన అన్నారు.

సబ్ కా ప్రయాస్ అంటూ ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ, సబ్‌కా ప్రయాస్ స్ఫూర్తిని మరింతగా ముందుకు తీసుకువెడుతూ, ఐక్యంగా ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి పని చేయాలని ప్రధాన్ పిలుపిచ్చారు.

భారతదేశ వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేసిన టెక్స్‌టైల్ పార్క్‌లలో కౌశల్ వికాస్ కేంద్రాలను ఏర్పాటు చేయడంపై కేంద్ర వాణిజ్యండపరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు డ ఆహారం డ ప్రజా పంపిణీ, జౌళి పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ దృష్టి కేంద్రీకరించారు. దీని కారణంగా, సరైన ధరకు అత్యున్నత నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందచేయగలరన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం భారత్ ను నమ్మదగిన భాగస్వామిగా ప్రపంచం చూస్తోందని, అపారమైన విద్యావకాశాలతో విదేశీ సంస్థలు, విద్యార్థులు తాము ఇష్టపడే అధ్యయన గమ్యస్థానంగా భారత దేశానికి వచ్చేలా ఉండాలని అన్నారు.

జాతీయ విద్యా విధానం, 2020పై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. స్థానిక స్వపరిపాలనా సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు, విద్యార్థులు, భారత పౌరుల నుంచి లక్షలాది సూచనలను సేకరించడం అన్నది సబ్ కా ప్రయాస్ కీలక ఉదాహరణ అని ఆయన అన్నారు. గ్రామీణ భారతంలో ప్రతి వ్యక్తినీ విద్య, నైపుణ్యాలతో సాధికారం చేయడం ద్వారా నూతన విద్యా విధానం 2020 మహాత్మా గాంధీ స్వప్నమైన గ్రామ స్వరాజ్‌ను సాకారం చేసేందుకు తోడ్పడుతుందన్నారు.

ఉన్నత విద్య శాఖ కార్యదర్శి సంజయ్ మూర్తి మాట్లాడుతూ, జాతీయ విద్యా పథకం 2020 ప్రాముఖ్యతను నొక్కి చెప్పడమే కాక, ప్రభుత్వ శాఖలు, ఎన్‌జిఒలు, పౌర సమాజాలు, ప్రైవేటుసంస్థలు, ముఖ్యంగా సామాన్య మానవుడి సమిష్టి భాగస్వామ్యంపై దృష్టి పెట్టి సుపరిపాలనను అందించేందుకు మద్దతునిస్తుందన్నారు.

గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన నినాదమైన సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ తోడ్పాటుతో భారత విద్యా వ్యవస్థ గుణాత్మకతను మెరుగుపరచడం గురించి యుజిసి చైర్మన్ ప్రొఫెసర్ డి.పి. సింగ్ మాట్లాడారు. కార్యదర్శి ప్రొఫెసర్ రజనీష్ జైన్ స్వాగతోపన్యాసం చేశారు.

సుపరిపాలనను ముందుకు తీసుకువెళ్ళే విషయంపై చర్చించేందుకు విద్య సంస్థలు, మంత్రిత్వ శాఖలు, విద్యావేత్తలు వేదికను పంచుకునేందుకు సబ్‌కా ప్రయాస్ః సమిష్టి భాగస్వామ్యం వెబినార్ తోడ్పడింది.

సాంకేతిక సెషన్‌కు పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, యుజి మాజీ సభ్యుడు ప్రొఫెసర్ ఆర్‌పి తివారీ అధ్యక్షత వహించారు. ఐఐఎన్ఒయు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. ఐఐఎఫ్‌టి ప్రొఫెసర్ రాకేష్ మోహన్, ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రకాష్ సింగ్ సాంకేతిక సెషన్‌ను ఉద్దేశించి ప్రసంగించారు.

సమిష్టి కృషి, భాగస్వామ్యం పాత్రపై దృష్టి పెట్టి సుపరిపాలనను సాధించేందుకు అవసరమైన అంశాలపై దృష్టి పెట్టి వెబినార్ చర్చను నిర్వహించింది. జాతీయ విద్యా విధానం, 2020 లక్ష్యాలను సాకారం చేసేందుకు సమిష్టి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి, సాధికారం చేయడంపై చర్చలు దృష్టి పెట్టాయి. ప్రజలను సాధికారం చేసేందుకు సమిష్టి భాగస్వామ్యం ప్రాముఖ్యతపై, విద్యా వ్యవస్థను మెరుగుపరచడం, దారిద్ర్యాన్ని నిర్మూలించడం, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, అంతిమంగా ఎవరినీ వెనుకబడనివ్వకపోవడంపై వెబినార్ దృష్టి పెట్టడం విశేషం. విద్యారంగంలో సుపరిపాలనను అందించాలన్న లక్ష్యాలను నెరవేర్చడంలో వెబినార్‌లో చర్చలు, పంచుకున్న భావనలు తోడ్పడతాయి.

సమన్వయ సాధనకు ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖల మధ్య రెండవ దఫా చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:రెండు మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడానికి ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల మధ్య రెండోసారి జరిగిన చర్చలు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయి. ఎంతోకాలం నుంచి పెండింగులో ఉన్న అంశాలను పరిష్కరించడానికి మరింత సమన్వయంతో పనిచేయాలని రెండు మంత్రిత్వ శాఖలు ఈ సమావేశంలో నిర్ణయించాయి. ఆయుష్ మంత్రిత్వ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్, సహాయ మంత్రి డాక్టర్ ముంజ్జపర మహేంద్ర భాయి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మున్సూఖ్ మాండవీయ మార్గదర్శకంలో రెండు మంత్రిత్వ శాఖల మధ్య చర్చలు జరిగాయి. సమావేశంలో పాల్గొన్న రెండు మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు సమస్యలను చర్చించి మరింత సమన్వయంతోపనిచేసే వీటిని పరిష్కరించుకోవాలని నిర్ణయించారు.

ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనలో ఆయుష్ ప్యాకేజీలను చేర్చడం, హెల్త్ వెల్ నెస్ సెంటర్లలో ఆయుష్ సేవలను ప్రవేశపెట్టడం, సామాజిక ఆరోగ్య అధికారుల శిక్షణా కార్యక్రమాల్లో ఆయుష్ అంశాన్ని ప్రవేశపెట్టడం, ఎన్ సి ఐ జగజ్జార్ క్యాన్సర్ కేర్ సెంటర్‌కు సహకారం అందించడం, ఇళ్లలో పనిచేస్తున్న వారిని నాల్గవ తరగతి ఆరోగ్య కార్యకర్తలుగా గుర్తించడం, నూతనంగా ఏర్పాటు కానున్న ఎయిమ్స్ లో ఆయుష్ సేవలను అందించడం లాంటి అంశాలతో సహా మరికొన్ని అంశాలు చర్చకు వచ్చాయి.

సమావేశంలో మాట్లాడిన శ్రీ మాండవీయ 'అందరికి ఆరోగ్యం 'అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం అన్ని శాఖలు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్న విధంగా సమగ్ర ఆరోగ్య విధానానికి రూపకల్పన జరగాల్సి ఉందని అన్నారు.ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆయుష్, ఆరోగ్య శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు 2021 ఆగష్టు 12 వ తేదీన తొలిసారిగా సమావేశం అయ్యారని ఆయన చెప్పారు. 'అందరికి ఆరోగ్యం' అంశాన్ని ఈ సమావేశంలో చర్చించామని అన్నారు.

ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ రెండు శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. దీనివల్ల ప్రధానమంత్రి ఆశయాలను సాధించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. రెండు శాఖల మధ్య సమన్వయం ఉండాలన్న శ్రీ మాండవీయ సూచనకు ఆయన ఆమోదం తెలిపారు.

ఆయుష్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజ్జపరా మహేంద్రభాయ్ రెండు మంత్రిత్వ శాఖలు అమలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను సమన్వయంతో సమగ్రంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రెండు శాఖల మధ్య అవగాహన, సమన్వయం కుదిరితే ప్రజలకు అందుబాటు ధరల్లో ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

సమావేశంలో ఎన్ హెచ్ ఏ సీఈఓ డాక్టర్ ఆర్ ఎస్ శర్మ, రెండు శాఖల సీనియర్ అధికారులు డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ ధర్మేంద్రసింగ్ గంగ్వార్, శ్రీ అలోక్ సక్సన, శ్రీమతి కవితా గార్గ్, శ్రీ లవ్ అగర్వాల్, డాక్టర్ విపుల్ అగర్వాల్, శ్రీ విశాల్ చౌహాన్, డాక్టర్ ఏంజెల్, శ్రీ డి సెంథిల్ పాండియన్ పాల్గొన్నారు.

'నూతన పట్టణ భారతదేశం' పై -ఆజాదీఏ75- విజయవంతం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:'నూతన పట్టణాలు, నగరాలతో కూడిన భారతదేశం, అంటే,.. భారతీయ పట్టణాలకు కొత్తరూపు,..అన్న అంశంపై 3 రోజులపాటు లక్నోలో మేథోమధనం జరిపేందుకు దేశం నలుమూలలనుంచి నిపుణులు వస్తున్నారనే భావన ఎంతో బాగుంది. ఈ సమ్మేళనం, ప్రదర్శన 75ఏళ్ల విజయాలను తప్పకుండా ప్రతిబింబిస్తాయి. స్వాతంత్ర్య అమృత మహోత్సవాల్లో దేశం తీసుకునే కొత్త తీర్మానాలనూ ఈ కార్యక్రమం ప్రతిఫలించి తీరుతుంది....''

ప్రారంభోత్సవం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలివి. 'ఆజాదీఏ75 ? కొత్త పట్టణ భారతదేశం: నగర దృశ్యంలో పరివర్తన' అన్న అంశంపై ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో అక్టోబరు 5న సమ్మేళాన్ని, ఎగ్జిబిషన్ .ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. లక్నోలోని గాంధీ ప్రతిష్టాన్ ప్రాంగణంలో సదస్సు, ఎగ్జిబిషన్.లతో 3 రోజుల సంరంభం ఈ నెల 7న ముగిసింది. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు ముగుస్తున్న సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట దేశవ్యాప్తంగా జరిగే వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "భారతదేశ శక్తి సామర్థ్యాలను తేటతెల్లం చేసి, మన విశ్వాసాలను మేల్కొలిపే" కార్యక్రమంగా ఈ కార్యక్రమాన్ని పరిగణించాలని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆజాదీఏ75 పేరిట నిర్వహించిన సదస్సుకు ఎగ్జిబిషన్.కు వివిధ భాగస్వామ్య వర్గాలనుంచి, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులనుంచి ఎంతో ప్రోత్సాహకరమైన ప్రతిస్పందన లభించింది. ప్రారంభోత్సవం అనంతరం పలు కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. పలు రంగాలకు నిపుణులు, వక్తలతో సమాంతర సదస్సులను కూడా నిర్వహించారు. విభిన్నమైన ఫ్లాగ్ షిప్ పథకాల కింద కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేపట్టిన కార్యక్రమాల పరిధిలోని పలు అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. నీటి రక్షణ నగరాలు, చిన్న, మధ్యతరహా అంతస్తుల ఇళ్ల నిర్మాణానికి సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానం అమలు, స్మార్ట్ నగరాల నిర్మాణ కార్యక్రమం ద్వారా పట్టణ పరివర్తన, వందేళ్ల స్వాతంత్ర్యం అనంతరం మెట్రో రైలు రవాణా వ్యవస్థ, మురికి వాడలులేని నగరాలు, సమ్మిళిత గృహ నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు రియల్ ఎస్టేట్ నియంత్రణ ప్రాధికార సంస్థను (ఆర్.ఇ.ఆర్.ఎ.ను) బలోపేతం చేయడం, మార్కెట్లోని అగ్రశ్రేణి సంస్థల భాగస్వామ్యంతో స్మార్ట్ సిటీ కార్యకలాపాల కేంద్రాల నిర్వహణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో జీవనోపాధికి సదుపాయాలు కల్పించడం తదితర అంశాలపై ఈ సమ్మేళన

చార్టర్ విమానాల ద్వారా భారతదేశానికి వచ్చే విదేశీయులకు తాజా టూరిస్ట్ వీసాలను అక్టోబర్ 15 నుంచి అమల్లోకి తేనున్న హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:కోవిడ్-10 మహమ్మారి వ్యాప్తి కారణంగా భారత్‌దేశంలో విదేశీయులకు మంజూరు చేసే అన్నిరకాల వీసాలు గత సంవత్సరం నిలిపివేయబడ్డాయి. కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తిని కట్టడి చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రయాణాలపై అనేక రకాల ఇతర ఆంక్షలను విధించింది. మెరుగుపడుతున్న కోవిడ్-19 పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న తరువాత, విదేశీయులు భారతదేశంలోకి రావడానికి, ఉండేందుకు టూరిస్ట్ వీసా కాకుండా, ఇతరేత్రమైన భారతీయ వీసాలను పొందేందుకు గాను అనుమతించబడ్డారు. విదేశీ పర్యాటకులు భారతదేశానికి వచ్చేందుకు అనుమతించడానికి పర్యాటక వీసాలను ప్రారంభించాలని అనేక రాష్ట్ర ప్రభుత్వాల నుండి మరియు పర్యాటక రంగంలోని వివిధ వాటాదారుల నుండి ఎంహెచ్ఏకు పలు అభ్యర్థనలు అందుతున్నాయి. దీంతో ఎంహెచ్ఏ ఆరోగ్య ఉ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వంటి అన్ని ప్రధాన భాగస్వామ్య పక్షాల వారిని సంప్రదించింది. పర్యాటక మంత్రిత్వ శాఖ మరియు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ పర్యాటకులు వస్తారని భావిస్తున్నారు. వివిధ ఇన్‌పుట్‌లను పరిశీలించిన తరువాత, ఎంహెచ్ఏ అక్టోబర్ 15, 2021 నుండి చార్టర్డ్ విమానాల ద్వారా భారతదేశానికి వచ్చే విదేశీయులకు తాజా టూరిస్ట్ వీసాలను మంజూరు చేయడం ప్రారంభించాలని నిర్ణయించింది. చార్టర్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ కాకుండా ఇతర విమానాల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించే విదేశీ టూరిస్టులు, తాజా టూరిస్ట్ వీసాలపై నవంబర్ 15, 2021 నుండి దేశంలోకి అనుమతించనున్నారు. విదేశీ పర్యాటకులు, భారతదేశంలోకి తీసుకువచ్చే విమానాలు మరియు ల్యాండింగ్ స్టేషన్లలోని ఇతర భాగస్వామ్య పక్షాల వారు ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నోటిపై చేసిన అన్ని కోవిడ్-19 ప్రోటోకాల్‌లు, ఇతర నిబంధనలు అనుసరించాలి

దీనితో, ప్రస్తుతం ఉన్న మొత్తం కోవిడ్-19 పరిస్థితిని బట్టి వీసా మరియు అంతర్జాతీయ ప్రయాణాలపై విధించిన ఆంక్షలు మరింత సడలించబడినట్టయింది.

రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రిగా, కేంద్ర స్థాయిలో ప్రధానమంత్రిగా, ప్రజాసేవలో 20 ఏళ్లు పూర్తి చేసిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీని అభినందించిన కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా, 20 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అభినందించారు. ఈ మేరకు వరుస ట్వీట్లు చేశారు. "20 సంవత్సరాల క్రితం ఇదే రోజున, గుజరాత్ ముఖ్యమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ప్రారంభమైన అభివృద్ధి, సుపరిపాలన నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ 20 ఏళ్లలో, ప్రజలు, దేశ అభ్యున్నతి కోసం శ్రీ నరేంద్ర మోదీ రాత్రింబవళు కష్టపడ్డారు." అని ట్వీట్లలో ప్రశంసించారు.

"రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రిగా, కేంద్ర స్థాయిలో ప్రధానమంత్రిగా, ప్రజాసేవలో 20 ఏళ్లు పూర్తి చేసిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీని అభినందిస్తున్నా" అన్న కేంద్ర హోం మంత్రి, "ఈ 20 ఏళ్లలో ప్రజలు, దేశ అభ్యున్నతి కోసం శ్రీ నరేంద్ర మోదీ రాత్రింబవళ్లు కష్టపడ్డారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అంకితమై, తన దృఢ సంకల్పంతో, దూరదృష్టితో అసాధ్యాలను సుసాధ్యం చేశారు." అని పేర్కొన్నారు.

"మొదట గుజరాత్‌లో, తర్వాత కేంద్ర ప్రభుత్వంలో శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వంలో, నాయకత్వంలో పనిచేసే అవకాశం లభించడం నా అదృష్టం. బలమైన, స్వయంసంవృద్ధి దేశంగా భారత్‌ను మార్చే సంకల్పాన్ని నిజం చేయడానికి, శ్రీ మోదీ జీ నాయకత్వంలో మనమందరం ఉత్తమంగా కృషి చేద్దాం." అని మరికొన్ని ట్వీట్లలో శ్రీ అమిత్ షా పిలుపునిచ్చారు.

హుజూరాబాద్‌లో నమ్మకానికి.. అమ్మకానికి మధ్య పోటీ: మంత్రి హరీశ్‌రావు

హుజూరాబాద్, అక్టోబర్ 8:: ఈ ఉప ఎన్నికలో నమ్మకానికి మారుపేరైన టీఆర్ఎస్‌కు, అమ్మకానికి కేరాఫ్ అడ్రస్ అయిన బీజేపీకి మధ్య పోటీ అని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హుజూరాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థిగా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం మూడు, నాలుగో నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఈ ఉప ఎన్నికల్లో అబద్ధాల బీజేపీకి.. నిబద్ధతగల టీఆర్ఎస్‌కు.. ఆరాచకానికి.. అభివృద్ధికి..రూపాయి బొట్టు బిల్లకు..లక్ష రూపాయల కల్యాణలక్ష్మికి మధ్య పోటీ అని హరీశ్‌రావు అన్నారు.

తమ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు ఊరూరా ఘన స్వాగతం లభిస్తున్నదని చెప్పారు. పేదింటి బిడ్డ అయిన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు ఎన్నికల ఖర్చుల కోసం ప్రజలే డబ్బులు ఇస్తున్నారని తెలిపారు. పలువురు పేద మహిళలు ఆసరా పింఛన్ డబ్బులు ఇచ్చి ఆశీర్వదించారని పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికల్లో గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అద్భుతమైన మెజార్టీతో గెలుస్తాడన్నారు.

హుజూరాబాద్‌లో ముందునుంచే టీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 2001 లో రైతు నాగలి గుర్తుమీద నిలుచున్న ప్రజాప్రతినిధులను ఈ ప్రాంత ప్రజలు గెలిపించారని గుర్తుచేశారు. ఈటల రాజేందర్ రాకముందు.. ఆయన వెళ్లిపోయాక కూడా ఇక్కడ గెలిచేది టీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టంచేశారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసునని, అందుకే ఏ ఎన్నిక వచ్చినా కేసీఆర్‌కే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. తాము సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని, కేసీఆర్ ఇంట్లోనుంచి ఇస్తున్నారా? అంటూ ప్రజలను రెచ్చగొడుతున్నాయన్నారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నాయకులే సమాధానాం చెప్పాలన్నారు. సంపద పెంచు.. పేదలకు పంచు అనేది కేసీఆర్ విధానం అని, పేదలను దంచు.. పె(గ)ద్దలకు పంచు అనేది బీజేపీ విధానమని హరీశ్‌రావు అభివర్ణించారు. తెలంగాణ వచ్చినప్పటినుంచీ రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు డీజిల్ ధరలు పెంచి, కొత్త వ్యవసాయ చట్టాలు తెచ్చి అన్నదాతలను అరిగోసపెడుతున్నదన్నారు. ఈ ఉప ఎన్నికలో రైతు బాంధవుడైన కేసీఆర్ వైపు ఉంటారో లేదా అన్నదాతల ఉసురుపోసుకుంటున్న బీజేపీ వైపు ఉంటారో హుజూరాబాద్ రైతులు తేల్చుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

పేదల ఆత్మగౌరవానికి..ఈటల అహంకారానికి మధ్య పోటీ: గెల్లు శ్రీనివాస్‌యాదవ్

200 ఎకరాల్లో ఒక ఎకరం అమ్మి గెలుస్తానంటూ ఈటల రాజేందర్ అహంకారంగా మాట్లాడుతున్నారని, కానీ హుజూరాబాద్ ప్రజలు నిరుపేద బిడ్డనైన తన వెంటే ఉన్నారని టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ ఎన్నిక ఈటల అహంకారానికి..పేద ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య పోటీ అని అభివర్ణించారు. తనకు సీఎం కేసీఆర్ ఆశీస్సులు ఉన్నాయని, హుజూరాబాద్‌ను అభివృద్ధి చేసేంత శక్తిని తనకు దేవుడిచ్చాడని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈటల వందల కోట్లు తన గెలుపును ఆపలేవన్నారు. హుజూరాబాద్ ప్రజల ఆశీస్సులతో తాను భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నేత పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులున్నారు.

అన్ని ప్రభుత్వ పథకాల్లో నైపుణ్యాభివృద్ధి పై దృష్టి పెట్టాలి - శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:అన్ని ప్రభుత్వ పథకాల్లో నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని, కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. అనేక పారిశ్రామిక, టెక్స్-టైల్, ఆటోమొబైల్ పార్కులలో ప్రభుత్వం మరిన్ని వనరులను సమకూరుస్తున్నందున, అటువంటి, ప్రతి పార్కులోనూ సంబంధిత నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉండాలని, ఆయన సూచించారు.

''అందరి ప్రయత్నం : సమిష్టి భాగస్వామ్యం" అనే అంశంపై ఈ రోజు నిర్వహించిన ఒక వెబినార్ నుద్దేశించి శ్రీ గోయల్ ప్రసంగిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతున్న నూతన విద్యా విధానం (ఎన్.ఈ.పి) ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి పై దృష్టి పెడుతోందని అన్నారు. ద్వంద్వ డిగ్రీ కార్యక్రమాలు, విదేశీ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, విద్యా సంబంధమైన అంశాలతో పాటు స్వతంత్ర కళల పట్ల ఏ నూతన విద్యా విధానం ప్రోత్సాహాన్ని అందిస్తోందని, ఆయన చెప్పారు.

"ఎన్.ఈ.పి. 2015, జనవరి నుండి విస్తృతంగా సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో భాగంగా 2.5 లక్షల పంచాయతీల నుండి 2 లక్షలకు పైగా సూచనలతో పాటు దాదాపు 700 జిల్లాల నుండి ప్రతిపాదనలు స్వీకరించడం జరిగింది. ఎన్.ఈ.పి. ని ఇంతవరకు ఎవ్వరూ విమర్శించలేదు. ఇది అందరి ప్రయత్నం ఫలితంగా రూపొందించబడింది,'' అని ఆయన అన్నారు.ఇతర దేశాలతో వాణిజ్య చర్చల సమయంలో విదేశీ విశ్వవిద్యాలయాల తో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ఉన్నత విద్యలో నాణ్యత ను పెంపొందించడానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని, శ్రీ గోయల్ తెలియజేశారు.

''స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్.టి.ఏ) మరియు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సి.ఈ.పి.ఏ) లో యు.కె., ఆస్ట్రేలియా లేదా కెనడా వంటి అనేక దేశాలతో చర్చలు జరుగుతున్న సమయంలో, మేము విద్య ను సహకారంలో ఒక కీలక రంగంగా చేర్చడానికి ప్రయత్నిస్తున్నాము. ఎన్.ఈ.పి. ని ప్రాతిపదికగా ఉంచుకుని, ఫీజులను తగ్గించాలనే లక్ష్యంతో యూనివర్సిటీల మధ్య ఒప్పందాల కోసం కృషి చేస్తున్నాము."అని, ఆయన వివరించారు.

"ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిరంతర ప్రజా సేవలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ రోజు శుభదినం", అని, శ్రీ గోయల్ అన్నారు.

''సబ్కా ప్రయాస్' (సమిష్టి భాగస్వామ్యం) ప్రేరణ శక్తి గా మరియు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు, "సుపరిపాలన" మార్గదర్శక సూత్రంగా, మనం సమాజంలో ని అత్యంత అట్టడుగు వర్గాలకు చేరుకోగలుగుతున్నాము. సుపరిపాలన అంటే దేశాన్ని నిజాయితీగా మార్చడం, మన సంస్థ లలో నిజాయితీని ప్రవేశపెట్టడంతో పాటు, వాటిని పారదర్శకంగా చేయడం. 'అందరితో కలిసి' మరియు 'అందరి అభివృద్ధి' మన ప్రభుత్వ పథకాల వెనుక ఆదర్శం. ఇది మనకు 'అందరి విశ్వాసం' సంపాదించింది, దేశంలోని మొత్తం 135 కోట్ల జనాభాతో పాటు, దేశ భవితవ్యాన్ని మెరుగుపరచడానికి, భారతదేశానికి శ్రేయస్సు తీసుకురావడానికి, ఈ రోజు దేశం మొత్తం 'అందరి ప్రయత్నం' అనే మార్గంలో ఐక్యంగా ఉంది", అని, ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి మోదీ కలలు కంటున్న "నవీన భారతావని" వాస్తవ రూపం దాల్చడానికి ఎన్.ఈ.పి. పునాది వేస్తుందని, భారతదేశాన్ని స్వావలంబన దిశగా మార్చడానికి ఇది సహాయపడుతుందని, శ్రీ గోయల్ పేర్కొన్నారు. సుపరిపాలన ప్రమాణంగా, జనధన్; ఉజ్వల; ఎల్.ఈ.డి. బల్బులను ప్రోత్సహించడం; ఆయుష్మాన్ భారత్; డి.బి.టి; జె.ఏ.ఎం; ట్రినిటీ; ఒక దేశం-ఒక రేషన్ కార్డు; పి.ఎం.జి.కె.ఏ.వై. వంటి ప్రతిష్టాత్మక పథకాల అమలుతో ప్రపంచ దేశాల మధ్య భారత దేశ స్థాయి పెరుగుతోందని, ఆయన అభివర్ణించారు.

"సమిష్టి భాగస్వామ్యం (సబ్కా ప్రయాస్) ద్వారా ప్రజల భాగస్వామ్యం (జన్ భాగీదారీ), ప్రజా ఉద్యమానికి (జన్ ఆందోళన్) కి దారితీస్తుంది," అని శ్రీ గోయల్ పేర్కొన్నారు.

ఎన్‌డిడిబిలో నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్ బ్లూప్రింట్‌ను ఆవిష్కరించిన కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల సహా మంత్రి డాక్టర్ సంజీవ్ బాల్యాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఆనంద్‌లోని ఎన్‌డిడిబిలో జాతీయ డిజిటల్ లైవ్ స్టాక్ మిషన్ నమూనా పత్రాన్ని (బ్లూప్రింట్)ను కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి డాక్టర్ సంజీవ్ బాల్యాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిడిబి మానేష్ షా, భారత ప్రభుత్వ డిఎహెచ్‌డి (సిడడి) అదనపు కార్యదర్శి వర్షా జోషి,భారత ప్రభుత్వ డిఎహెచ్‌డి (ఎల్‌హెచ్) సంయుక్త కార్యదర్శి ఉపమన్య బసు, విజిటింగ్ పిఎస్ఎ ఫెలో, భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారు కార్యాలయం, డాక్టర్ సింధూర గణపతి, జిసిఎంఎంఎఫ్, ఎండి, గుజరాత్‌కు చెందిన వివిధ పాల యూనియన్ల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎస్ సోధి, ఎన్‌డిడిబి, దాని అనుబంధ సంస్థల సీనియర్ అధికారులు, టిసిఎస్, ఎర్నెస్ట్ ఉ యంగ్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కొందరు సీనియర్ అధికారులు దృశ్య మాధ్యమం ద్వారా ఇందులో పాలుపంచుకున్నారు.

ఈ రంగ అభివృద్ధికి అనుకూలంగా ఉండే వాతావరణాన్ని సృష్టించేందుకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలను క్రమబద్ధీకరించేందుకు సంఘటిత ప్రయత్నాలు చేసి ఉంటే వృద్ధి ఇంకా ఎంతో మెరుగ్గా ఉండేదన్నారు. ఎన్‌డిఎల్ఎంను మోహరించడం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం రైతు సంక్షేమ కేంద్రంగా పెట్టుకోవడమేనన్నారు. ఎన్‌డిఎల్ఎం అమలు తరువాత పశుసంవర్ధక రంగం భారీ పురోగతికి సిద్ధంగా ఉందని, ప్రస్తుతం ఉన్న పశు ఉత్పాదకత, ఆరోగ్యానికి సంబంధించిన సమాచార నెట్‌వర్క్ ఆధారంగా డిఎహెచ్‌డి, డిడిబి సంయుక్తంగా ఈ డిజిటల్ వేదికను అభివృద్ధి చేస్తున్నాయని అన్నారు. సరైన సమాచారం తోడ్పాటుతో పశుసంపద ద్వారా మెరుగైన ఆదాయాన్ని సాధించేందుకు రైతులకు తోడ్పడే , సాంకేతిక తోడ్పాటు కలిగిన వాతావరణాన్ని రైతు కేంద్రంగా సృష్టించాలన్నది లక్ష్యం. పాడి రైతులను వారి జీవనోపాధి వైవిధ్యీకరణ, ఆర్థిక సంక్షేమం లక్ష్యంగా పెట్టుకున్న విభిన్న ప్రత్యామ్నాయ కార్యకలాపాల ద్వారా బహుళ ఆదాయ మార్గాల్లో ప్రోత్సహించడం, భాగస్వామ్యం చేసేందుకు ఎన్‌డిడిబి ప్రేరణను ఇస్తుందని డాక్టర్ బాల్యాన్ అన్నారు.

అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ ప్రాముఖ్యతను, లాభాలను వివరిస్తూ, ఈ సాఫ్ట్‌వేర్ ను విజయవంతంగా అమలు చేయవలసిందిగా భాగస్వాములందరికీ వర్షా జోషి విజ్ఞప్తి చేశారు.

అన్ని పశువుల ప్రత్యేక గుర్తింపుకు పునాదిగా ఎన్‌డిఎల్ఎం వ్యవహరిస్తుందని, ఇది జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యంతో సహా అన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి కార్యక్రమాలకు మూల స్తంభం అవుతుందని చెప్పారు. విస్తృత స్థాయిలో భాగస్వాములను ఈ వాతావరణంలో అనుసంధానం చేయడం వల్ల ఈ డిజిట్ ప్లాట్‌ఫాం ద్వారా రైతు తాను ఎక్కడ ఉన్నా, తమ పెట్టుబడి ఎంతైనా మార్కెట్లలోకి ఎటువంటి ప్రయాస లేకుండా ప్రవేశించగలరు. ఈ వ్యవస్థలో బలమైన, ఆరోగ్యకరమైన జంతువుల పెంపకం, పోషణ వ్యవస్థలు, వ్యాధి పర్యవేక్షణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, జంతువులు, జంతు ఉత్పత్తులను గుర్తించదగిన విధానం కూడా ఉంటాయి.

ఆనంద్‌లోని జకారియాపురా గ్రామంలో ఎన్‌డిడిబి ఎరువుల నిర్వహణ చొరవను డాక్టర్ బాల్యాన్ దర్శించారు. జకారియాపురా గ్రామంలో రైతులతో సంభాషిస్తూ, బయోగ్యాస్ ప్లాంట్ల నూతన సాంకేతికతను ఆమోదించినందుకు వారిని ప్రశంసించారు. దీని ద్వారా ఉత్పత్తి అయిన బయో వ్యర్థాలను రైతులు తమ స్వంత పొలాలలో ఉపయోగించుకుంటారు. అదనపు బయో వ్యర్థాలను ఇతర రైతులకు అమ్మడం లేదా వాటిని సేంద్రీయయ ఎరువులుగా మార్చడం చేస్తారు. బోర్సాద్‌లోని వాస్నాలోని వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్‌డిడిబి సుధాన్ ట్రేడ్ మార్క్ ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించే బ్రాండ్ గుర్తింపును సృష్టించేందుకు తోడ్పడుతుంది. అంతేకాదు, బయోగ్యాస్ ఉపయోగించే మహిళలందరూ కూడా కట్టెలపై వండేందుకు వాటిని సేకరించడం, తత్సంబంధిత ఆరోగ్య సమస్యలు తగ్గినట్టుగా పేర్కొన్నారు.

ఎన్‌డిడిబికి చెందిన ఆధునిక ఓవం పికప్ ఉ ఇన్‌విట్రో ఎంబ్రియో ప్రొడక్షన్ (ఒపియు-ఐవిఇపి) కేంద్రాన్ని కేంద్ర మంత్రి దర్శించినప్పుడు భారతీయ పశు జనాభాలో జన్యుపరమైన మెరుగుదల, ఉత్పాదకత పెంచడంపై ప్రధానంగా దృష్టి పెట్టడం అన్నది కీలక అంశంగా నిలిచింది.

కోవిడ్ తదనంతర ప్రపంచ క్రమంగా భారతదేశానికి కొత్త అవకాశాలను అందిస్తుంది: ఎంఓఎస్ ఐటి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:ఎలక్ట్రానిక్స్, ఐటి, స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ (యుఎస్ఐబిసి) యుఎస్ -ఇండియా బిజినెస్ కౌన్సిల్ నిర్వహించిన ఇండియా ఐడియాస్ సమ్మిట్‌కు హాజరయ్యారు, తయారీ ఆర్థిక వ్యవస్థలపై మాట్లాడారు.

భారతదేశంలో ప్రస్తుతం జరుగుతున్న, ప్రపంచంలోనే అతిపెద్ద టెక్నాలజీ ఆధారిత టీకా కార్యక్రమం (కోవిడ్ -19) పురోగతి గురించి శ్రీ చంద్రశేఖర్ ప్రస్తావించారు. 930 మిలియన్ల మందికి టీకాలు వేయడంలో విశేషమైన ఘనతను ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి 1.3 బిలియన్ మందికి టీకాలు వేయడం లక్ష్యమని ధృవీకరించారు. ఈ కార్యక్రమం విజయవంతమైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు, ఇప్పటివరకు అతిపెద్ద టీకాల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నొక్కి చెప్పారు. కోవిన్ వంటి ప్లాట్‌ఫామ్ ఫాస్ట్ ట్రాక్ డెవలప్‌మెంట్, ఈ ప్రచారానికి బలమైన వెన్నెముకను అందించడమే కాకుండా, ప్రజలను శక్తివంతం చేసే సాధనంగా కూడా పనిచేసింది, ఇప్పుడు వివిధ ప్రభుత్వాలు దీనిని ఉపయోగించడానికి ఎదురుచూస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్త భారతదేశానికి చిహ్నంగా చెప్పారు.

డిజిటల్ ఎకానమీపై కోవిడ్ మహమ్మారి ప్రభావం, భవిష్యత్ గురించి మాట్లాడుతూ, "ప్రపంచం ఇప్పుడు కొత్త విశ్వసనీయ గ్లోబల్ వాల్యూ చైన్‌ల వైపు చూస్తున్నందున పోస్ట్ వరల్డ్ ఆర్డర్ భారతదేశానికి కొత్త అవకాశాలను అందిస్తుంది" అని చంద్రశేఖర్ తెలియజేశారు.దీనిని భారతదేశంలోని టెక్ ఇండస్ట్రీకి "వై 2 కె టైప్ మూమెంట్" అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటలైజేషన్ రేటు వేగంగా పెరుగుతోందని, భారతదేశంలో మాత్రమే 800 మిలియన్ల మంది వినియోగదారులు ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారని ఆయన అన్నారు. సార్వత్రిక ఇంటర్నెట్ కవరేజీని సాధించాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున ఈ సంఖ్య త్వరలో 1 బిలియన్ మార్కును దాటడం ఖాయం. ఇది డిజిటల్ ఉత్పత్తులు ఉ సేవలకు డిమాండ్‌ను పెంచుతుంది, అందువల్ల డిజిటల్ ఎకానమిని పెంచుతుంది.

తనకు అప్పగించిన రెండు మంత్రిత్వ శాఖల ముఖ్యమైన పాత్రలను నొక్కి చెబుతూ, శ్రీ చంద్రశేఖర్ ఇలా వ్యాఖ్యానించారు - "ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ అలాగే నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ కీలక పాత్ర పోషిస్తుంది, రాబోయే 5 సంవత్సరాలలో భారతదేశం 1 ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఎకానమికి విస్తరించాలని చూస్తోంది. "ఎలక్ట్రానిక్స్ తయారీలో, మొత్తం సెమీ కండక్టర్లు మరియు ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ మరియు మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఒక పాలసీ రోడ్‌మ్యాప్‌పై పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. "విధానపరమైన చర్యల ద్వారా ఈ స్థలాన్ని వృద్ధి చేయాలని మేము ఆశిస్తున్నాము" అని ఆయన అన్నారు. సెషన్‌ని మోడరేట్ చేస్తున్న ఆపిల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విరాట్ భాటియాతో మాట్లాడుతూ, ప్రైవేట్ మరియు పబ్లిక్ వాటాదారులతో ప్రభుత్వంలో ఎటువంటి దాపరికం లేదని శ్రీ చంద్రశేఖర్ తెలియజేశారు. దాని విధాన సూత్రీకరణ ప్రక్రియలో. "విధాన రూపకల్పనకు సంప్రదింపు విధానం మా ప్రభుత్వ డిఎన్ఏ లో ఉంది. ప్రతి పాలసీ వినియోగదారుల జీవన సౌలభ్యం మరియు వ్యాపార సౌలభ్యం జంట ప్రయోజనాల ద్వారా నడపబడుతుంది "అని ఆయన చెప్పారు.

"నైపుణ్యం కలిగిన వ్యక్తుల తక్షణ అవసరం గురించి మాట్లాడుతూ, డిజిటలైజేషన్ వేగంతో డిజిటల్ సేవలకు డిమాండ్ పెరిగింది. సామర్థ్యం, నైపుణ్యం కలిగిన వ్యక్తుల మధ్యంతర కొరతకు దారితీస్తుంది. "భారతదేశం నైపుణ్య రాజధానిగా ఎదగాలని పిఎం మాకు సూచించారు" అని ఆయన పేర్కొన్నారు. .

నాడు ఎండిన జలాశయాలు.. నేడు నిండు కుండలు: మంత్రి గంగుల కమలాకర్

హుజూరాబాద్, అక్టోబర్ 8:: నాడు ఎక్కడ చూసినా ఎండిన జలాశయాలు మాత్రమే కనిపించేవని, కేసీఆర్ కృషితో నేడు అవి నిండుకుండలుగా మారాయని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు తయారుచేసుకున్న ఆయుధం కేసీఆర్ అని అభివర్ణించారు. హుజూరాబాద్‌లోని 29వ వార్డు గాంధీనగర్‌లో శుక్రవారం ఆయన టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా దళితులను ఎవరూ పట్టించుకోలేదన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఏడేళ్ల క్రితం ఉన్నట్లు తెలంగాణ ఇప్పుడు లేదని, కేసీఆర్ కృషితో ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అమలుచేస్తూ బతుకులు బాగుచేస్తున్నామన్నారు. ఇదివరకు మన ఆడబిడ్డలు నీటికోసం ట్యాంకర్ల వద్ద బిందెలతో కనిపించేవారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు.

టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ నిఖార్సైన ఉద్యమకారుడని, ఇరవై ఏళ్లు కేసీఆర్ వెంటే నడిచినా ఏనాడూ పదవి కోసం పాకులాడలేదన్నారు. అందుకే గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు ఈసారి సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పారు. గెల్లును గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉండి సేవచేస్తాడని తెలిపారు. ఈటల రాజేందర్ ఇరవై ఏళ్లుగా అనేక పదవులు చేపట్టినా హుజూరాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదని మంత్రి గంగుల కమలాకర్ దుయ్యబట్టారు. అసలు ఈటల రాజేందర్ ఎవరికోసం రాజీనామా చేశారో ఇక్కడి ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌కు మెడికల్ కాలేజీ కావాలని రాజీనామా చేశారా లేదా హుజూరాబాద్‌లో ఇండస్ట్రీలు పెట్టాలని రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కేవలం తన స్వార్థంకోసం మాత్రమే ఈటల రాజేందర్ రాజీనామా చేశారని మండిపడ్డారు. ఇప్పుడు బీజేపీలో చేరి మళ్లీ తనకు ఓటేయాలంటూ ప్రజలు చుట్టూ తిరుగుతున్నాడన్నారు. మంత్రిగా ఉన్నప్పుడే ఏమీ చేయలేని ఈటల రాజేందర్ ఇప్పుడేం చేస్తారని మంత్రి గంగుల ప్రశ్నించారు. హుజూరాబాద్ అభివ

ఆశిష్ నేడు పోలీసుల ఎదుట హాజరవుతాడు: అజయ్ మిశ్రా

లక్నో, అక్టోబర్ 8:: తన కుమారుడు ఆశిష్ మిశ్రా శనివారం ఉత్తరప్రదేశ్ పోలీసుల ఎదుట హాజరవుతాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తెలిపారు. ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి లఖింపూర్ ఖేరీ హింసాత్మక ఘటనపై వివరణ ఇచ్చిన ఆయన శుక్రవారం లక్నోకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తన కుమారుడికి పోలీసులు గురువారం సమన్లు ఇచ్చారని, అయితే ఆరోగ్య కారణాల వల్ల పోలీసుల ఎదుట కు శుక్రవారం రిపోర్ట్ చేయలేకపోయినట్లు అజయ్ మిశ్రా చెప్పారు.

తన కుమారుడు పోలీసులకు శనివారం రిపోర్ట్ చేస్తాడని ఆయన అన్నారు.తన కుమారుడు ఆశిష్ మిశ్రా ఎక్కడికీ పారిపోలేదని, దర్యాప్తులో పోలీసులకు సహకరిస్తాడని కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా మీడియాకు తెలిపారు. ప్రతిపక్షం ప్రతి అంశంపై తన రాజీనామాకు డిమాండ్ చేస్తున్నదని ఆయన ఆరోపించారు. దర్యాప్తు మొదలైతే అసలు విషయాలు బయటకు వస్తాయని అన్నారు. నిజమే గెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

సోని యే!లో పిల్లలకు ఇష్టమైన యంగ్ ప్రేక్షకులకు ఫ్యాన్ ఫేవరిట్ షో

- అక్టోబర్10న ఉదయం11గంటలకు ప్రత్యేక వర్చువల్ లాంచ్ పార్టీ

అక్టోబర్ 8, 2021, సోని యే!లో అంతిమ చేజ్ కామెడీ – ఒగ్గి మరియు బొద్దింకలు, అక్టోబర్ 11 నుండి ప్రతి సోమవారం నుండి శుక్రవారం వరకు సోని యే! ప్రసిద్ధ కిడ్స్ ఎంటర్టైన్మెంట్ టీవీ ఛానెల్ తమ యంగ్ ప్రేక్షకులకు ఫ్యాన్ ఫేవరిట్ షో అందిస్తుంది, ఇదికొత్త దేశీ ట్విస్ట్ కలిగి ఉంది. ఈ రిఫ్రెష్ ఎపిసోడ్ లోఒగ్గి, బొద్దింకలు వాటి స్నేహితులను ప్రత్యేకమైన కామెడీ కనిపించటం జరుగుతుంది మూడు కొంటె బొద్దింకల జోయి, డీడీ మరియు మార్కీ చేసే నిరంతర దాడికి గురైన పిల్లితో, కొత్త ఒగ్గి ఎపిసోడ్ వస్తుంది మరియు ప్రతి ఎపిసోడ్‌లో యంగ్ అభిమానులకు తమ ప్రియమైన పిల్లిని చూడటం ఒక ఉల్లాస కరమైన ట్రీట్ అవుతుంది. ఆ ముగ్గురిని వెంటాడుతున్న ఒగ్గి మరియు దాన్ని నిరంతరం ముప్పుతిప్పలు పెట్టే ఆ మూడు గడుగ్గాయిలు, దాని మీద ఉల్లాసకరమైన చేష్టలతో విసిగించేచిలిపి చేష్టలు చిన్నారులను కడుపుబ్బ నవ్విస్తాయి. సోని యే! అక్టోబర్10న ఉదయం11గంటలకు ప్రత్యేక వర్చువల్ లాంచ్ పార్టీలోఈ షో ప్రత్యేక ప్రీమియర్‌ని చూడటానికి అవకాశం కల్పించడం ద్వారా చిన్నారులందరినీ అల్టిమేట్ ఒగ్గి ఫ్యాన్ డమ్ జరుపుకోవటానికి ఆహ్వానిస్తోంది. వాచ్పార్టీ ఎపిసోడ్‌ల యొక్క స్నీక్పీక్‌ను అద్భుతమైన ఆటలు, బహుమతులు మరియు ప్రత్యేక ఆశ్చర్యాలతో మరింత సరదా అందిస్తుంది.వాచ్పార్టీకి నమోదుచేసుకోవడానికి, ఇక్కడ క్లిక్చే యేయండి.

http://bit.ly/WatchPartyofOggyandtheCockroaches

బి ఫిజ్ నూతన ప్రచారకర్త అర్జున్ కపూర్‌తో బోల్డ్ నెస్ ను పునర్నిర్వచించిన పార్లే ఆగ్రో

హైదరాబాద్ , అక్టోబర్ 8:: 'బి బోల్డ్, బి బ్రేవ్' అనేది పార్లే ఆగ్రో యొక్క ఉల్లాస భరిత మాల్ట్ ఫ్లేవర్డ్ ఫ్రూట్ డ్రింక్ బి ఫిజ్ నినాదం. బి ఫిజ్ నూతన యాడ్ క్యాంపెయిన్ తో ఇది భారతదేశ బేవరేజ్ విభాగంలో కంపెనీ మరో సారి సంచలనం కలిగించింది. ఈ బ్రాండ్ నూతన ప్రచారకర్తగా అర్జున్ కపూర్ కనిపిస్తారు. కొత్త పానీయం, కొత్త ప్రచారకర్త ను తీసుకురావడం ద్వారా భయపడని, ధైర్యంగా ఉండే వాతావరణాన్ని బి ఫిజ్ తో పార్లే ఆగ్రో ఏర్పరిచి నట్లయింది. గత ఏడాది మహమ్మారి ఉన్న కాలంలోనే బిఫిజ్ ఆవిష్కరించబడింది. ఇది పార్లే ఆగ్రో స్పార్కింగ్ ఫ్రూట్ డ్రింక్ విభాగానికి ఉద్వేగభరిత జోడింపు. ఇది అసాధారణ విజయం సాధించింది. సెకండరీ డేటా అధ్యయనం ప్రకారం, పెరిగిపోతున్న డిమాండ్ ప్రకారం, ఏడాది కాలంలోనే బి ఫిజ్ ఒక్కటే మాల్ట్ ఫ్లేవర్డ్ ఫ్రూట్ డ్రింక్ విభాగం వృద్ధిని 10 రెట్లు చేయనుంది. అంతేగాకుండా, తన విశిష్ట రుచితో ఇది ఈ విభాగంలో సంచలనం సృష్టించింది. 160 మి.లీ. ధర రూ.10. పార్లే ఆగ్రో ఒక ఏడాదిలో సుమారుగా అర బిలియన్ యూనిట్లను విక్రయించింది. అంతేగాకుండా భారతదేశంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న మాల్ట్ ఫ్లేవర్డ్ ఫ్రూట్ డ్రింక్ గా నిలిచింది. ఈ సందర్భంగా పార్లే ఆగ్రో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఎంఓ నాడియా చౌహాన్ మాట్లాడుతూ, "గత ఏడాది కాలంలో బి ఫిజ్ ఎంతో వృద్ధి చెందింది. మా విక్రయాలను అనేక రెట్లు పెంచింది. ఇది స్పార్కింగ్ ఫ్రూట్ డ్రింక్ విభా గాన్ని విస్తరించడం మాత్రమే గాకుండా, మాల్ట్ ఫ్లేవర్డ్ ఫ్రూట్ డ్రింక్ విభాగాన్ని అనేక రెట్లు పెంచింది. ఈ విభాగం భారత్ లో దాదాపుగా లేదనే చెప్పవచ్చు. మహమ్మారి కాలంలోనూ పోర్ట్ ఫోలియోను విజయవంతంగా విస్తరిం చడం అనేది మా ఆకాంక్షలకు, అంకితభావానికి నిదర్శనం. బి ఫిజ్ తో మేం మాల్ట్ ఫ్లేవర్డ్ ఫ్రూట్ డ్రింక్ విభాగాన్ని నిర్మించాలనుకుంటున్నాం. అది మాత్రమే గాకుండా, 2030 నాటికి యాప్పీ ఫిజ్, బి ఫిజ్ సమ్మేళన శక్తితో స్పార్కింగ్ ఫ్రూట్ డ్రింక్ విభాగాన్ని 10,000 కోట్ల విభాగంగా చేద్దామని కూడా భావిస్తున్నాం" అని అన్నారు. బి ఫిజ్ అనేది ధైర్యానికి సంబంధించిన డైనమిక్ డ్రింక్ గా చిత్రీకరించబడింది. నూతన అనుభూతులను, సవాళ్ళను కోరుకునే వారి కోసం ఉద్దేశించింది. అర్జున్ కపూర్ ను ప్రచారకర్తగా నియమించడంపై నాడియా చౌహాన్ మాట్లాడుతూ, "'ధైర్యం', 'ప్రత్యేకత' లకు ప్రాతి నిధ్యం వహించేందుకు అర్జున్ కపూర్ చక్కటి ఎంపిక. ఈ బ్రాండ్ కు ప్రచారకర్తగా ఆయన మాతో ప్రయాణం చేయడం మాకెంతో ఆనందదాయకం. అర్జున్ వ్యక్తిత్వానికి తగినట్లుగానే, బి ఫిజ్ కూడా ఇతరులతో పోల్చేందుకు వీల్లేని పటిష్ఠమైన విలక్షణ గుణాన్ని కలిగిఉంది. ఈ జంట ఈ బ్రాండ్ కు గొప్ప విజిబిలిటీని నిర్మిస్తారని, భారతదేశ వ్యాప్తంగా పానీయాల వినియోగదారులకు సులభమైన ఎంపికగా చేస్తారని మేం విశ్వసిస్తున్నాం" అని అన్నారు. పార్లే ఆగ్రోతో అనుబంధం గురించి నటుడు అర్జున్ కపూర్ మాట్లాడుతూ, "ఒక విశిష్టమైన, ధైర్యవంతమైన, విప్లవాత్మకమైన బి ఫిజ్ లాంటి పానీయానికి ప్రతినిధ్యం వహించడం నాకెంతో సంతోషాన్ని అందిస్తోంది. బ్రాండ్ ఆశయాలు, మీ సొంత వ్యక్తిత్వం పరిపూర్ణంగా మమేకమయ్యే సందర్భాలు కొన్ని ఉంటాయి. బి ఫిజ్ తో నా అనుబంధం అలాంటిదే. ఈ ప్రకటన కోసం చేసిన షూటింగ్ ఒక గొప్ప అనుభూతిని అందించింది. అడ్వర్టయిజింగ్ పట్ల ఈ బ్రాండ్ అనుసరించిన ధోరణి అలాంటిది. బ్రాండ్ పట్ల పార్లే ఆగ్రోకు గల ఆశయంతో నేను పాలుపంచు కోవడం ఆనందంగా ఉంది. వారి వృద్ధి ప్రయాణంలో భాగమవుతూ ముందుకెళ్లాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

పిఎమ్ కేర్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పిఎస్ఎ ఆక్సీజన్ ప్లాంటులను దేశ ప్రజలకు అంకితం ఇచ్చిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ , అక్టోబర్ 8:పిఎమ్ కేర్స్ లో భాగం గా 35 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల లో ఏర్పాటైన 35 ప్రెశర్ స్వింగ్ అడ్ సార్ప్ శన్ (పిఎస్ఎ) ఆక్సీజన్ ప్లాంటు లను ఉత్తరాఖండ్ లోని ఎఐఐఎస్ఎ రుషీకేశ్ లో జరిగిన ఒక కార్యక్రమం లో దేశ ప్రజల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అంకితమిచ్చారు. దీనితో దేశం లోని అన్ని జిల్లాల లో పిఎస్ఎ ఆక్సీజన్ ప్లాంటులు పని చేయడం మొదలైంది. ఈ కార్యక్రమం లో కేంద్ర మంత్రులు, ఉత్తరాఖండ్ గవర్నరు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ఆరోగ్య సంరక్షణ రంగ వృత్తి నిపుణులు పాలుపంచుకొన్నారు.

ఈ సందర్భం లో సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, పవిత్రమైనటువంటి నవరాత్రి పర్వదినాలు ఈ రోజు నుంచి మొదలవుతున్నాయన్నారు. నవరాత్రి ఉత్సవాల లో ఒకటో రోజు న మాత శైలపుత్రి ని ఆరాధించడం జరుగుతుంది అని ఆయన అన్నారు. హిమవంతుని పుత్రిక శైలపుత్రి అని ఆయన తెలిపారు. "ఈ నేల కు ప్రణమిల్లాలని, హిమాలయాల కు నెలవు అయినటువంటి ఈ భూమి కి వందనాన్ని ఆచరించాలని ఈ రోజు న నేను ఇక్కడ కు విచ్చేశాను; దీని కంటే జీవితం లో ఒక గొప్ప ఆశీర్వాదం మరేమి ఉంటుంది!" అని ప్రధాన మంత్రి అన్నారు. ఒలింపిక్ క్రీడోత్సవాల లో, పారాలింపిక్స్ లో అద్భుత ప్రదర్శన ను ఇచ్చినందుకు రాష్ట్రానికి ఆయన అభినందన లు తెలిపారు. ఉత్తరాఖండ్ గడ్డ తో తనకు గల సంబంధం ఒక్క హృదయానిది మాత్రమే కాదని, అది కార్యాచరణ తో కూడా ముడిపడి ఉన్నటువంటిదని, కేవలం సారం తో కాక మూల పదార్థం తో కూడా ఆ బంధం పెనవేసుకొందని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

తనకు సంబంధించినంత వరకు ఈ రోజు కు ఉన్నటువంటి ప్రాముఖ్యాన్ని గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, 20 సంవత్సరాల క్రితం ఇదే రోజు న ప్రజల కు సేవ చేసే ఒక కొత్త బాధ్యత తనకు దక్కిన సంగతి ని ఆయన గుర్తు కు తెచ్చుకొన్నారు. ప్రజల కు సేవ చేయడం, ప్రజల మధ్య జీవనాన్ని కొనసాగించడం తాలూకు తన ప్రస్థానం అనేక దశాబ్దాలు గా కొనసాగుతూ వచ్చినప్పటికీ, 20 ఏళ్ళ కిందట ఈ రోజున నే, గుజరాత్ ముఖ్యమంత్రి గా ఒక కొత్త బాధ్యత ను చేపట్టాను అని ఆయన అన్నారు. ఈ యాత్ర ఆరంభం నాడే ఉత్తరాఖండ్ రాష్ట్ర స్థాపన చోటు చేసుకొంది, ఆ తరువాత కొద్ది నెలల కే గుజరాత్ ముఖ్యమంత్రి పదవి ని చేపట్టానని ఆయన చెప్పారు. ప్రజల ఆశీస్సుల తో తాను ప్రధాన మంత్రి పదవి ని చేపడుతాను అని ఎన్నడూ ఊహించలేదు అని ఆయన అన్నారు. ప్రభుత్వ అధినేత గా తాను ఈ అవిచ్ఛిన్న ప్రయాణం తాలూకు 21వ సంవత్సరం లోకి అడుగు పెడుతున్న సందర్భం లో దేశ ప్రజల కు, ఉత్తరాఖండ్ ప్రజల కు శ్రీ నరేంద్ర మోదీ తన కృతజ్ఞత ను వ్యక్తం చేశారు.

యోగ, ఆయుర్వేద వంటి ప్రాణ ప్రదాన శక్తులు బలాన్ని పుంజుకొన్న గడ్డ మీది నుంచే, ఈ రోజు న, ఆక్సీజన్ ప్లాంటుల ను దేశ ప్రజల కు అంకితమిస్తుండడం పట్ల శ్రీ నరేంద్ర మోదీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి తో పోరాడడం కోసం అంత తక్కువ వ్యవధి లో భారతదేశం సిద్ధం చేసిన సదుపాయాలు మన దేశం యొక్క సామర్థ్యాన్ని చాటి చెప్తున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. మహమ్మారి రాక ముందు ఒకే ఒక టెస్టింగ్ ల్యాబు ఉండగా, ఆ తరువాత రమారమి 3,000 టెస్టింగ్ ల్యాబ్స్ తో కూడిన నెట్ వర్క్ ను నిర్మించడం జరిగింది అని ఆయన అన్నారు. భారతదేశం మాస్కుల ను, కిట్ లను దిగుమతి చేసుకొంటున్నది కాస్తా వాటి ఎగుమతిదారు దేశం స్థాయి కి మార్పు చెందింది అని ఆయన అన్నారు. దేశం లోని సుదూర ప్రాంతాల లో సైతం కొత్త వెంటిలేటర్ ల తాలూకు సదుపాయాల ను అందుబాటు లోకి తీసుకు రావడమైందన్నారు. 'మేడ్ ఇన్ ఇండియా కరోనా వ్యాక్సీన్' ను త్వరిత గతి న మరియు పెద్ద ఎత్తు న భారతదేశం తయారు చేసింది అని ఆయన అన్నారు. భారతదేశం లో ప్రపంచం లో అతి పెద్దదైనటువంటి మరియు అత్యంత వేగవంతమైనటువంటి టీకాకరణ ఉద్యమాన్ని అమలుపరచిందని ఆయన అన్నారు. భారతదేశం సాధించిన పని మన దృఢసంకల్పాని కి, మన సేవ కు, అలాగే మన సంఘీభావాని కి ఒక చిహ్నం గా ఉందని ప్రధాన మంత్రి అన్నారు.

సాధారణమైన రోజుల లో భారతదేశం ఒక్కరోజు లో 900 మెట్రిక్ టన్నుల లిక్విడ్ మెడికల్ ఆక్సీజన్ ను ఉత్పత్తి చేస్తూ వచ్చింది అని ప్రధాన మంత్రి అన్నారు. డిమాండు పెరుగుతూ ఉండటం వల్ల, భారతదేశం మెడికల్ ఆక్సీజన్ ఉత్పత్తి ని పదింతల కు పైగా పెంచింది అని ఆయన చెప్పారు. ఇది ప్రపంచం లోని ఏ దేశాని కి అయినా ఊహించలేనటువంటి లక్ష్యం, కానీ భారతదేశం దీనిని చేసి చూపించింది అని ఆయన అన్నారు.

93 కోట్ల డోజుల కరోనా వ్యాక్సీన్ ను ప్రజల కు ఇప్పించడం అనేది భారతదేశం లో ప్రతి ఒక్కరికీ గర్వకారణం అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. అతి త్వరలోనే భారతదేశం 100 కోట్ల వ స్థానాన్ని అధిగమిస్తుంది అని ఆయన అన్నారు. భారతదేశం కోవిన్ ప్లాట్ ఫార్మ్ ను నిర్మించడం ద్వారా అంతటి భారీ స్థాయి లో టీకా మందు ను ఇవ్వడం ఎలా సాధ్యమో యావత్తు ప్రపంచాని కి చాటిచెప్పింది అని ఆయన అన్నారు.

పౌరులు వారి సమస్యల తో ప్రభుత్వం వద్దకు వస్తే అప్పుడు ఏదైనా చర్య తీసుకోవడం కోసం ప్రభుత్వం వేచి ఉండబోదు అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ భ్రాంతిని ప్రభుత్వ మనస్తత్వం లో నుంచి మరియు వ్యవస్థ లో నుంచి తొలగించడం జరుగుతోంది అని ఆయన చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వమే పౌరుల వద్ద కు వెళ్తోందని ఆయన అన్నారు.

ఆరేడేళ్ళ కిందటి కాలం వరకు చూస్తే, కేవలం కొన్ని రాష్ట్రాలే ఎఐఐఎమ్ఎస్ సదుపాయాన్ని కలిగి ఉన్నాయి; ప్రస్తుతం ఎఐఐఎమ్ఎస్ ను ప్రతి ఒక్క రాష్ట్రాని కి తీసుకు పోవడం కోసం కృషి జరుగుతోంది అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. మనం 6 ఎఐఐఎమ్ఎస్ ల మజిలీ నుంచి వేగం గా కదలుతూ 22 ఎఐఐఎమ్ఎస్ లతో కూడిన ఒక బలమైన నెట్ వర్క్ ను నిర్మించే దిశ లో ముందుకు పోతున్నాం అని ఆయన చెప్పారు. దేశం లో ప్రతి జిల్లా లో కనీసం ఒక వైద్య కళాశాల తప్పక ఉండాల్సిందే అన్నదే ప్రభుత్వం లక్ష్యం కూడాను అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్ ను ఏర్పాటు చేయాలి అనే కల ను పూర్వ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయీ నెరవేర్చారు అని శ్రీ నరేంద్ర మోదీ గుర్తు కు తెచ్చారు. సంధానాని కి, అభివృద్ధి కి మధ్య ప్రతక్ష సంబంధం ఉందని శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయీ నమ్మారు అని ప్రధాన మంత్రి చెప్పారు. ఆయన ప్రేరణ వల్ల ప్రస్తుతం దేశం లో సంధాన సంబంధి మౌలిక సదుపాయాల కల్పన ను ఇదివరకు ఎన్నడూ ఎరుగనంతటి వేగం తో, ఇదివరకు ఎన్నడూ ఎరుగనంతటి స్థాయి లో మెరుగు పరచే దిశ లో పాటుపడడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు.

జల్ జీవన్ మిశన్ ను 2019వ సంవత్సరం లో ప్రారంభించడానికి పూర్వం ఉత్తరాఖండ్ లో 1,30,000 కుటుంబాలు మాత్రమే నల్లా నీటి ని అందుకొంటూ ఉండేవి అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ లో 7,10,000 కు పైబడిన ఇళ్ళ కు నల్లా ద్వారా తాగునీరు అందడం మొదలైందని తెలిపారు. అంటే, కేవలం రెండు సంవత్సరాల కాలం లో రాష్ట్రం లో సుమారు 6 లక్షల ఇళ్ళు నల్లా నీటి ని అందుకొన్నాయి అని ఆయన వివరించారు. ప్రతి ఒక్క జవాను, ప్రతి ఒక్క మాజీ సైనికోద్యోగి.. వీరి ప్రయోజనాల కోసం కూడా ప్రభుత్వం చాలా గంభీరం గా కృషి చేస్తోందని ప్రధాన మంత్రి తెలిపారు. 'వన్ ర్యాంకు, వన్ పెన్షన్' ను అమలు చేసి సాయుధ బలగాల లోని మన సోదరుల 40 ఏళ్ళ నాటి డిమాండు ను తీర్చింది మా ప్రభుత్వం అని కూడా ఆయన అన్నారు.

తెలంగాణ ఆడబిడ్డలకు పెద్దన్న సీఎం కేసీఆర్ : ముఠా గోపాల్

హైదరాబాద్ , అక్టోబర్ 8:దేశంలోనే ఎక్కడలేని విధంగా బతుకమ్మ చీరలను అందజేసి తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలిచాడని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం కవాడిగూడలోని ఉన్నికోట కమ్యూనిటీ హాల్, భోలక్‌పూర్ డివిజన్‌లోని తాళ్లబస్తీ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన బతుకమ్మ చీరలను ఆయన మహిళలకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ పండుగలకు ప్రత్యేక కానుకలు అందజేసి తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు 70 వేల బతుకమ్మ చీరలను అందజేశామని ఆయన తెలిపారు.

ఇవే కాకుండా పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ, భోలక్‌పూర్ డివిజన్‌ల టీఆర్ఎస్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్, వై. శ్రీనివాస్ రావు, ప్రధానకార్యదర్శి చాంద్‌పాషా, నాయకులు బింగి నవీన్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లీటర్‌కు 30 ఎంఎల్ తక్కువ వచ్చేలా..

హైదరాబాద్ , అక్టోబర్ 8:బంకుల్లో మైక్రో చిప్ అమర్చి.. మోసాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను ఎస్‌వోటీ, బాలానగర్ పోలీసులు అరెస్టు చేశారు.

పెట్రోల్ యంత్రంలో చూపించే రీడింగ్ పాయింట్స్ ఒక్కొక్కటిగా జంప్ అవుతూ.. చివరకు తక్కువగా ఇంధనం పోసే.. సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన ఈ గ్యాంగ్.. ఏకంగా బంక్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకొని.. దందా కొనసాగిస్తున్నట్లు విచారణలో తేలింది. సైబరాబాద్ పరిధిలోని బాలానగర్ జోన్ డీసీపీ పద్మజ తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్టకు చెందిన ఎండీ ఫయాజుల్(46), అల్వాల్‌కు చెందిన కురడె సందీప్(38), బండ్లగూడకు చెందిన ఎండీ అస్లాం(29),యాదాద్రి భువనగిరి జిల్లా లింగరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కలివెర నర్సింగరావు(32) గతంలో పెట్రోల్ బంక్‌లో పనిచేసి మానేశారు. ముఠాగా ఏర్పడి.. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు ప్లాన్ వేశారు. రాజస్థాన్‌లోని నూరజ్ అనే వ్యక్తి రూపొందించిన ఓ సాఫ్ట్‌వేర్ చిప్‌ను తీసుకొని.. మరింత అభివృద్ధి చేశారు.

బంక్‌ల నిర్వాహకులకు ఎరగా వేశారు. యంత్రాన్ని ట్యాంపరింగ్ చేసి అందులో మైక్రో చిప్ పెట్టి మోసం చేస్తున్నారు. లీటర్‌కు 30 ఎంఎల్, 50 ఎంఎల్ వరకు తక్కువ వచ్చేలా ప్రోగ్రాం తయారు చేశారు. ఈ చిప్‌ను రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు బంక్ డీలర్లకు అమ్మకాలు చేశారు. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రాల్లోని ఇప్పటికే 34 బంక్‌లలో మైక్రో చిప్‌లను అమర్చారు. ఇలా వచ్చిన డబ్బులను ఒప్పందం ప్రకారం పంచుకుంటారు.

విశ్వసనీయ సమాచారం మేరకు లీగల్ మెట్రాలజీ అధికారులతో పాటు సైబరాబాద్ ఎస్‌వోటీ డీసీపీ సందీప్, ఎస్‌వోటీ బాలానగర్ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, జీడిమెట్ల, మేడ్చల్ పోలీసులు రంగంలోకి దిగి ఈ నలుగురు నిందితులను పట్టుకున్నారు. వారిని నుంచి బంక్ రీడింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఈ ముఠాపై జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, మేడ్చల్, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆరు కేసులు నమోదై ఉన్నాయి. నిందితులతో పాటు పెట్రోల్ బంక్ డీలర్లు, యజమానులు హకీంపేట టీఎస్ఆర్‌టీసీ నిర్వాహకుడు వంశీధర్‌రెడ్డి, పూడూర్ మేడ్చల్ హరిహర ఫిల్లింగ్‌స్టేషన్ నిర్వాహకుడు రమేశ్, మైలార్‌దేవ్‌పల్లి జీఎంఆర్ ఫిల్లింగ్ స్టేషన్ సూపర్‌వైజర్ బీరవెల్లి మహేశ్వర్, జీడిమెట్లలోని లక్ష్మి గణేశ్ బంక్ నిర్వాహకుడు నాగండ్ల వెంకటేశ్‌లపై కేసు నమోదు చేశారు.

భవిష్యత్ తరాలకు పౌష్టికాహార లోపం లేని భావి పౌరులను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉంది.!!

-అదనపు కలెక్టర్ రాజర్షి షా

-సంగారెడ్డి, అక్టోబర్ 8 (నేటినిజం ప్రతినిధి) శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్వైజర్లు ,పోషణ అభియాన్ సిబ్బందితో పిల్లల ఎదుగుదల, పోషణ లోపం, తీసుకుంటున్న చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాజర్షి మాట్లాడుతూ పిల్లలలో పోషణ లోపం లేకుండా తగిన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. తక్కువ బరువు గల పిల్లల ఇంటి వద్దకు వెళ్లి ఇంటి వద్ద వారికి అవసరమైన పౌష్టికాహారం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల శాతం తగ్గించడం లో భాగంగా ప్రతి గురువారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. న్యూట్రిషన్ కు సంబంధించిన ఆహార పదార్థాలను, సంబంధిత చార్ట్స్ డిస్ప్లే చేయడంతో పాటు పిల్లల తల్లిదండ్రులకు పంచ సూత్రాలు పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

పౌష్టికాహార లోపం గల పిల్లలు ఎక్కడ ఎక్కువ మంది ఉన్నారో ఆయా కేంద్రాల పై సిడిపిఓలు, సూపర్వైజర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అన్ని అంగన్వాడీ కేంద్రాలలో వెయింగ్ మిషన్ సరిగ్గా పని చేసేలా చూసుకోవాలన్నారు. పౌష్టికాహార లోపం లేకుండా పిల్లలు ఎదిగేలా అంగన్వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి పిల్లలకు అందిస్తున్న ఆహారంను వేర్వేరు సమయాల్లో చెక్ చేయాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించేలా చూడాలన్నారు. పిల్లలకు సరైన న్యూట్రిషన్ ఫుడ్ అందేలా చూడాలన్నారు . పిల్లలు వయస్సుకు తగ్గ ఎత్తు ,బరువు ఖచ్చితంగా ఉండాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, సి డి పి వో లు, సూపర్వైజర్లు, పోషన్ అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారికి అష్టోత్తర శత ఘటాభిషేకం

యాదాద్రి, అక్టోబర్ 8:: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో శుక్రవారం స్వాతి నక్షత్ర పూజల కోలహలం నెలకొంది. తెల్ల వారు జాము 4గంటల నుంచి ఐదున్నర వరకు గిరిప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో మూడున్నర గంటల పాటు శ్రీవారి అష్టోత్తర శతఘటాభిషేకం కనులపండువగా నిర్వహించారు.

బాలాలయంలో ప్రతిష్టామూర్తులకు నిజాభిషేకం మొదలుకుని తులసీ అర్చన వరకు నిత్య పూజలు జరిపారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతం నిర్వహించిన అర్చకులు లక్ష్మీనరసింహుడిని ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. హారతి నివేదనలు అర్పించారు.

సుదర్శన నారసింహ హోమం ద్వారా శ్రీవారిని కొలిచి, సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. ప్రతీ రోజు నిర్వహించే నిత్య తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకను వీక్షించారు. దేవేరులను ముస్తాబు చేసి గజ వాహనంపై ముఖ మండపంలోనే ఊరేగించారు.

శ్రీలక్ష్మీ సమేతు డైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణ తంతు జరిపారు. ఆలయంలో దర్శనం అనంతరం రూ.100 చెల్లించి అతి తక్కువ సమయంలో జరుపుకునే అష్టోత్తర పూజల్లో భక్తులు పాల్గొని మొక్కు లు తీర్చుకున్నారు. పాతగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి.

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాయంత్రం వేళలో బాలాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. పరమ పవిత్రంగా మహిళా భక్తులు పాల్గొనే సేవలో భక్తులు పాల్గొని తరించారు. లక్ష్మీ అమ్మవారికి విశేష పుష్పాలతో అలంకారం జరిపారు. తిరువీధి సేవ అ